

టిడ్కో ఫ్లాట్లు కావాలా..



మండపేట పట్టణం గొల్లపుంతలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఫేజ్2 టిడ్కో గృహాల సముదాయం

- ఏక చెల్లింపు విధానంలో టిడ్కో గృహాలు అందజేత
- 365 ఎస్ఎఫ్‌టీకి రూ.3.65 లక్షలు.. 430 ఎస్ఎఫ్‌టీకి రూ.4.15 లక్షలు
- కొత్తవారికి అవకాశం.. త్వరలోనే ఉత్తర్వులు

మండపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో కొన్ని ప్లాట్లను పంపిణీ చేయగా, మిగిలిన వాటిని ఏక మొత్తం చెల్లింపు విధానంలో అర్హులైన కొత్తవారికి ప్రభుత్వం అందజేయనుంది. 365 చదరపు అడుగుల నిర్మాణాన్ని రూ.3.65 లక్షలు, 430 చదరపు అడుగులు అయితే రూ.4.15 లక్షలకు విక్రయించనున్నారు. బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్సులో రాష్ట్ర పురపాలక శాఖమంత్రి పి.నారాయణ కమిషనర్లకు దీనిపై స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మండపేట పట్టణం గొల్లపుంతకాలనీలో టిడ్కో గృహల సముదాయం ఫేజ్1, ఫేజ్ 2లో నిర్మించారు. ప్రతి బ్లాక్‌లో 32 కుటుంబాలు ఉండేలా ఇళ్లను నిర్మించారు. టీడీపీ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఇళ్ల రంగులను మార్చిందే తప్ప లబ్ధిదారులకు ఇళ్లను అందించిన దాఖాలాలు మాత్రం కనిపించలేదు. మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు గగ్గోలు పెట్టినా పట్టించుకోలేదు. దాంతో చాలా మందికి వాటి స్వాధీనం విషయంలో సందిగ్ధత నెలకొంది. రుణాలు తీసుకో వడంలోను లబ్ధిదారులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఇక్కడ నిర్మించిన ఫ్లాట్లు మొత్తం 6,124 వరకు ఉన్నాయి. ఫేజ్1లో 1632 మందికి సింగిల్ బెడ్‌రూం ఇళ్లను ఉచితంగా అందించగా, 1560 మంది మాత్రమే ఇళ్లను తీసుకోగా మరో 102 ఫ్లాట్ల వరకు ఖాళీగా ఉన్నాయి. అలాగే ఫేజ్1లో 360 అడుగులు సింగిల్‌బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి 100 గృహలను లబ్ధిదారులకు ఇవ్వగా, మరో 92 వరకు ఖాళీగా ఉన్నాయి. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి 2240కిగాను 1500 మందికి ఇళ్లను లబ్ధిదారులకు అందించగా, మరో 700 గృహల వరకు ఖాళీగా ఉన్నాయి. ఇక ఫేజ్2లో 2064 ఇళ్లను నిర్మించగా, రిజిస్ట్రేషన్ ప్రక్రియ కేవలం 64 ఇళ్లకు మాత్రమే పూర్తికాగా మిగిలినవి 2 వేలు పంపిణీ జరగలేదు. ఫేజ్2లో సింగిల్ బెడ్‌రూం ఇళ్లు 1632 ఉండగా, డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి 492 వరకు ఖాళీగా ఉన్నాయి. తాజాగా ఫేజ్1, ఫేజ్2లో మిగిలిపోయిన ఇళ్లకు సంబంధించి వన్‌టైం పేమెంట్ చెల్లించినవారికి అర్హతను బట్టి కేటాయించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో టిడ్కో ఫ్లాట్లకు మోక్షం కలగనుంది. అయితే ఇప్పటికే లబ్ధిదారులైన వారికి ఇందులో చోటుండదు. కొత్తవారికి మాత్రమే ఈ చాన్స్ ఉంటుందని చెబుతున్నారు. ఏమైనా ఫ్లాట్ల కోసం ఎదురుచూస్తున్న వారి ఇంటి కల నెరవేరనుంది.



పెట్రో కెమి..కిల్ ఫ్యాక్టరీ!

గత వైసీపీ నిర్లక్ష్యం..గాల్లో కలిసిన ప్రాజెక్టు

ఒక్క ఛాన్స్ అంటే.. ఓటరు ఆలోచించాడు.. అవకాశమిచ్చాడు.. ఆ అవకాశాన్ని జగన్ దుర్వినియోగం చేశారు.. ఎంతలా అంటే అభివృద్ధి చేయాల్సిన రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి వదిలేశారు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ఘటనే ఇందుకు నిదర్శనం.. గత వైసీపీ విధానాలతో రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కు వెళ్లిపోయిందని నాయకులు అంటూనే ఉంటారు.. ఇది అక్షర సత్యం.. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా 32 వేల కోట్ల ప్రాజెక్టు ఇస్తామంటే వదులుకుంటారా.. అధికారమిచ్చిన ఐదేళ్లూ పట్టించుకోకుండా జగన్ వదిలేశారు.. ఆ ప్రాజెక్టును అతీగతీ లేకుండా చేసేశారు...ఆ కథాకమామిషు ఏమిటో తెలుసుకోవాలనుందా..!

- కాకినాడ, ఆంధ్రజ్యోతి


కాకినాడలో రూ.32 వేల కోట్లతో తొమ్మిదేళ్ల కిందట తలపెట్టిన పెట్రో కెమికల్ కాంపెక్స్ ఏర్పాటు ముగిసిన అధ్యాయంగానే కనిపిస్తోంది. ఇటీవల నెల్లూరులో రూ.లక్ష కోట్లతో బీపీసీఎల్ పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్న నేపథ్యంలో కాకినాడ పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటు వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఎప్పటికైనా ఇక్కడా ఆ తరహా ప్రాజెక్టు రాకపోతుందా అనే ఆశలు తాజాగా నెల్లూరు ప్రాజెక్టుతో అడియాశలైనట్లయింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో పూర్తిగా ఈ ప్రాజెక్టు మూలనపడి పోయింది. పెట్రో కాంప్లెక్స్ వీజీ ఎఫ్ నిధులు రాష్ట్రం భరించే విషయంలో అప్పటి జగన్ సర్కారుదే తప్పని కేంద్రం కుండబద్దలు కొట్టింది. ఇక్కడ ప్రాజెక్టు ఏర్పాటుకు రెండు వేల ఎకరాలు సిద్ధంగా ఉన్నప్పటికీ గత సర్కారు తీరు వల్ల ప్రాజెక్టు కొడిగట్టిపోయింది.

కొంపముంచిన బాధ్యతా రాహిత్యం..

రాష్ట్ర విభజన సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అప్పటి కేంద్ర ప్రభుత్వం ఒక్కో జిల్లాకు ఒక్కో కొత్త ప్రాజెక్టు కేటాయించింది. అందులో భాగంగా కాకినాడలో రూ.32 వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. 2017లో కాకినాడ ఎస్ఈజెడ్‌లో రెండు వేల ఎకరాల్లో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి గెయిల్- హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా ఒప్పందం కుదుర్చుకున్నాయి. 1.5 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో పెట్రో కాంప్లెక్స్‌ను ఏర్పాటుకు వీలుగా అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో అంగీకార పత్రాలు మార్చుకున్నాయి. విదేశాల నుంచి ముడిచమురు కాకినాడకు దిగుమతి చేసుకుని ఇక్కడే కర్మాగారం ఏర్పాటుచేసి, దాన్ని శుద్ధి చేసి దేశీయంగా వినియోగించడం ప్రాజెక్టు ముఖ్యోద్దేశం.

- విభజన హామీగా పెట్రో కెమికల్ కాంప్లెక్స్
- రూ.32 వేల కోట్లతో ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- తొమ్మిదేళ్లు పూర్తయినా కదలిక లేదు
- తాజాగా నెల్లూరులో బీపీసీఎల్ ప్రాజెక్టు
- కాకినాడ పెట్రో కెమికల్ ప్రాజెక్టుపై చర్చ
- ప్రాజెక్టు జాప్యానికి బాధ్యత వైసీపీదేనన్న కేంద్రం
- నాడు బాబు పట్టుదల.. జగన్ నిర్లక్ష్యంతో మూలకు

నాడు చంద్రబాబు ఏం చేశారు?



ఈ ప్రాజెక్టును సాధ్యమైనంత వేగంగా పట్టాలెక్కించడానికి 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం చొరవ చూపింది. పనులు ప్రారంభిం చేలా కేంద్రంపై అప్పటి సీఎం చంద్రబాబు ఒత్తిడి తెచ్చారు. రూ.32 వేల కోట్ల విలువైన పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు వల్ల కేంద్రం ఇచ్చే ఆర్థిక మద్దతు, రాష్ట్ర ప్రభుత్వం భారీగా లబ్ధిపొందనున్నందున రూ.5,615 కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) రూపంలో తమకు చెల్లించాలని అప్పట్లో కేంద్రం మెలిక పెట్టింది. అలా అయితేనే ప్రాజెక్టు ముందుకు కదులుతుందని పేర్కొంది.కానీ రాష్ట్రం విడిపోయి నష్టపోయినందున ఆ మొత్తం తాము భరించలేమని చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. కేంద్రం కొంత మెత్తబడినట్టే కనిపించింది.

తరువాత జగనేం చేశారు?



2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. నాటి నుంచీ ఈ ప్రాజె క్టు ఊసు పక్కన పడిపోయింది. తీవ్ర విమర్శల నేపథ్యంలో 2021 జూన్‌లో కేంద్రాన్ని సీఎం హోదాలో జగన్ కలిసి ప్రాజెక్టు కొనసాగించాలని కోరా రు. కానీ కేంద్రం నుంచి సానుకూల ప్రకటనేదీ రాలేదు. మూడేళ్ల కిందట పెట్రో కాంప్లెక్స్ అసలు కాకినాడకు వస్తుందా? రాదా? అనే దానిపై పలువురు ఎంపీలు కేంద్రాన్ని లోక్‌సభలో ప్రశ్నిస్తే ప్రాజెక్టు జాప్యానికి జగన్ ప్రభుత్వమే కారణం అని కుండ బద్దలుకొట్టింది. తాము అన్ని అనుమతులు మంజూరు చేసినా నష్ట భర్తీ నిధి చెల్లింపుపై ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుపై నిర్ణయం ఏపీ ప్రభుత్వానిదేనని సమాధానమిచ్చింది. అయినా జగన్ ప్రభుత్వం కనీసం ప్రయత్నించలేదు. దీంతో ప్రాజెక్టుపై పూర్తిగా ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభు త్వం మళ్లీ ఆ ఫ్యాక్టరీ ఏర్పాటుపై దృష్టి పెట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నెల్లూరు ప్రాజెక్టుతో మళ్లీ చర్చ..

రాష్ట్రప్రభుత్వం చొరవతో ఇటీవల నెల్లూరులో రూ.లక్ష కోట్లతో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఏటా తొమ్మిది మిలియన్ మెట్రిక్ టన్నుల సా మర్థ్యంతో దీన్ని స్థాపిస్తోంది. ప్రాజెక్టు ద్వారా వేల మందికి ఉపాధి అవకాశాలు రానుండగా.. 42 నెలల్లో పూర్తి చేసేలా ఇటీవల ప్రణాళికలు సిద్ధమయ్యాయి. రెండు రోజుల కిందట బీపీసీఎల్ పెట్రో కాంప్లెక్స్‌కు కేంద్ర అటవీ పర్యావరణశాఖ నుంచి కీలక అనుమతులు జారీ అయ్యాయి. దీంతో ఇప్పుడు కాకినాడ పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటు అంశం మరోసారి చర్చనీయాంశమైంది. తొమ్మిదేళ్ల నుంచి అతీగతీ లేని ప్రాజెక్టు నెల్లూరు పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుతో ఇక్కడా ఎంతో కొంత కదలిక రావాలనే ఆకాంక్షలు వ్యక్తమవుతున్నాయి. పెట్రో ప్రాజెక్టుకు అనువైన వాతావరణం ఉన్నా కేంద్రం పట్టించుకోక కాకినాడ పెట్రోకాంప్లెక్స్ అధ్యాయం ముగిసినట్టే కనిపిస్తోంది.



రామచంద్రపురం పట్టణం ముచ్చుమిల్లిలో 4వ నెంబరు చౌకధరల దుకాణంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్, ఆర్డీవో అఖిల

జిల్లాలో స్మార్ట్‌కార్డుల పంపిణీ ప్రారంభం

మంత్రి, ఎమ్మెల్యేల సమక్షంలో పంపిణీ : సివిల్ సప్లయిస్ అధికారి ఉదయభాస్కర్ వెల్లడి

అమలాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రక్రియ గురువారం జిల్లావ్యాప్తంగా ప్రజా ప్రతినిధుల సమక్షంలో ప్రారంభమైనట్టు జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఎ.ఉదయభాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆధునిక సాంకేతికతతో ఎక్కడా ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేనివిధంగా స్మార్ట్‌కార్డులకు రూపకల్పన చేయడం జరిగిందని, రాష్ట్రంలో ఎక్కడ నుంచైనా స్మార్ట్ కార్డును ఉపయోగించి రేషన్ తీసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. రేషన్ అక్రమాలకు పూర్తిగా చెక్ పెడుతూ రేషన్ పంపిణీ ప్రక్రియ అత్యంత పాదర్శకంగా జరిగేవిధంగా ఏటీఎం కార్డు మాదిరిగా స్మార్ట్‌కార్డును డిజైన్ చేసినట్టు తెలిపారు. ఈ స్మార్ట్‌కార్డు వివరాలను ఆన్‌లైన్‌లో ప్రతిబింబిస్తాయన్నారు. నూతన సాంకేతికత ద్వారా వినియోగదారులకు పాదర్శకంగా సులభతరంగా తక్షణమే నిత్యావసర సరుకులు అందేవిధంగా ఈ కార్డులు రూపొందించబడ్డాయని భాస్కర్ తెలిపారు. ప్రతీకార్డుపై ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ ఉంటుందని, దీని ద్వారా లబ్ధిదారుడు కొనుగోలును తక్షణం ట్రాక్ చేయవచ్చని, లబ్ధిదారులకు సరుకులు సక్రమంగా అందుతున్నాయా అనేది నిర్ధారించుకోవచ్చన్నారు. ప్రభుత్వ అధికారులకు అందుబాటులోని డేటా బేస్ ఆధారంగా తగిన కుటుంబాలను గుర్తిస్తారని, రేషన్ విధానాన్ని ఈకేవైసీ లేదా ఆధారిత లింకింగ్‌తో సురక్షితంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకువచ్చారని ఆయన తెలియజేశారు.



వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రకృతి సేంద్రియ సాగు ద్వారా భూసారం పెంచండి

కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

అమలాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సహజసిద్ధ సేంద్రియ వ్యవసాయసాగు విధానాల ద్వారా భూసారాన్ని కాపాడవచ్చని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. పెట్టుబడులు, రసాయనిక ఎరువుల వినియోగాన్ని, ఖర్చులను తగ్గించి రసాయనిక రహిత ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందించవచ్చని రైతులకు పిలుపునిచ్చారు. గురువారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో జాతీయ వ్యవసాయ మిషన్ అమలులో భాగంగా ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయ అనుబంధ విభాగాల్లోని కన్వర్జెన్స్ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. వార్షిక ప్రణాళికలపై సమీక్షించిన కలెక్టర్ సహజ సిద్ధ సేంద్రియ వ్యవసాయ ప్రాయోజిత కార్యక్రమమన్నారు. ఇందులో పశువులు ప్రాధాన్యంగా స్థానిక ఆవుజాతి సమగ్ర సహజ వ్యవసాయ పద్ధతులకు సంబంధించి వివిధ మండలాల పరిధిలోని 140 క్లస్టర్లలో వివిధ గ్రామాల్లో అమలుచేస్తూ నాణ్యమైన ఉత్పత్తులను అందించడం జరుగుతుందన్నారు. ఆవుల మూత్రంతో జీవామృత రసాయనాలు తయారుచేసి పంటల సాగుకోసం విక్రయిస్తున్నారని, డీఆర్డీఏ అధికారులు మరిన్ని డ్వాక్రా సంఘాలకు ప్రకృతిసేద్య రసాయనాల తయారీపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, పశుసంవర్ధకశాఖ అధికారి వెంకట్రావు, డీహెచ్‌వో రమణ పాల్గొన్నారు.

'పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా చర్యలు చేపట్టండి'



గాలికుంటు వ్యాధి టీకాల మాసోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్


అమలాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 15 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నెలరోజులపాటు పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలను వేయించి వ్యాధి వ్యాప్తిని సమూలంగా అరికట్టాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. పశు సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధకశాఖ అధికారులతో కలిసి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమానికి ప్రచార పోస్టర్‌లను విడుదల చేశారు. సకాలంలో పశువులకు వ్యాధులు పెరగకుండా టీకాలను వేయించాలన్నారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఈ నెల 15 నుంచి నెల రోజుల పాటు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యాధి ప్రబలితే పాల ఉత్పత్తి తగ్గి రైతుకు ఆర్థికంగా నష్టం కలుగుతుందని, దూడలు మరణిస్తాయని, దీంతో ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు తీసుకుని టీకాలు వేయించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. ఒక్క పశువు కూడా మిగలకుండా అన్నింటికీ టీకాలు వేయించాలని కోరారు. జిల్లాపశు సంవర్థకశాఖ అధికారి కె.వెంకట్రావు, సహాయ సంచాలకుడు ఎల్.విజయారెడ్డి, పశువైద్యాధికారి డి.మాధవి, ఎం.నారాయణరావు పాల్గొన్నారు.

భూమి కుంగుతోంది!



- చమురు, గ్యాస్ కార్యకలాపాలతో దిగబడిన భూమి
- పట్టించుకోని ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు, ప్రభుత్వాలు
- 40 ఏళ్లుగా ముడిచమురు, గ్యాస్ నిక్షేపాల వెలికితీత
- భూమి కుంగి వేలాది ఎకరాలకు ముంపు బెడద
- కాంటూర్ సర్వే జరపాలని స్థానికుల డిమాండ్

అల్లవరం మండలం మొగళ్లమూరిలో సాగులేని ముంపు చేలు.. ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద గాలిలో గ్యాస్ మంటలు (ఫైల్‌ఫొటో)



అల్లవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గోదావరి బేసిన్ పరిధిలో ఉభయగోదావరి జిల్లాల్లో గడిచిన 40 ఏళ్లుగా ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు కార్యకలాపాలు సాగిస్తూ అపారంగా చమురు, సహజ వాయువు నిక్షేపాల వెలికితీతవల్ల భూమి కుంగిపోయి వేలాది ఎకరాలకు ముంపు, ముప్పు ఏర్పడింది. చమురు, సహజ వాయువుల అన్వేషణకై వేలాదిగా బోర్లువేసి సిస్మిక్ సర్వేలు జరపడం, బాబింగ్ కార్యకలాపాల వల్ల భూమి కుంగి జలకాలుష్యం పెరిగిందని రైతు నాయకులు, పర్యావరణవేత్తలు ఆరోపిస్తున్నారు. 2011లో కాంటూర్ సర్వే రిపోర్టు ఆధారంగా భూమి కుంగినట్టు నిర్ధారణ కాగా, దాని ఫలితంగా క్రమేపీ భూమి కుంగుతూ ముంపు సమస్య జఠిలమైందని చెబుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంటూర్ సర్వే జరిపించేందుకు ఓఎన్జీసీ, చమురు సంస్థలపై ఒత్తిడి తీసుకువచ్చి భూరక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. జాప్యం జరిగితే సముద్ర జలాలు భూమిని కబలించే ప్రమాద పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన చెందుతున్నారు. సముద్ర నీటిమట్టం, భూ ఉపరితల మట్టం నిర్ధారణ చేసి కాంటూర్ సర్వే ప్రక్రియ జరపాలనే డిమాండ్ వినిపిస్తోంది. కోనసీమలో సముద్ర తీరం, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వేలాది ఎకరాల పర్ర భూములు ఆక్రమణలకు గురై ముంపు సమస్య వల్ల వరి సాగు కనుమరుగైంది. సముద్ర జలాల్లోను ఓఎన్జీసీ సిస్మిక్ సర్వేలు, డ్రిల్లింగ్‌లు చమురు, గ్యాస్ నిక్షేపాల వెలికితీత వల్ల తీరం వెంబడి రైతు జిరాయితీ భూములు, అటవీశాఖ భూములు కోతకు గురై సముద్రం సుమారు కిలోమీటరు ముందుకు చొచ్చుకు వచ్చిందని ఆరోపిస్తున్నారు. ఓఎన్జీసీ పనులు ఆపకుంటే తీర మండలాలు ఉనికి కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. మరోపక్క కోనసీమలో ఓఎన్జీసీ టెర్మినల్ ప్లాంట్ల వద్ద ఫ్లెయిర్ ఫిట్‌లపై నిరంతరంగా గాలిలో గ్యాస్ మంటల వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతిని వాయు కాలుష్యం పెరిగిపోయింది. సముద్ర జలాలు భూ ఉపరితలంపై వందల సంఖ్యలో చమురు, సహజ వాయువుల బావులు, ప్లాట్‌ఫారాల ద్వారా రోజూ లక్షల క్యూబిక్ మీటర్ల మేర నిక్షేపాల వెలికితీత కొనసాగుతోంది. ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలకు ఏటా లక్షల కోట్ల ఆదాయం వస్తున్నా ఈ ప్రాంతాల అభివృద్ధిని ఆ సంస్థలు పట్టించుకోకపోవడంతో పెనుముప్పు పొంచి ఉంది. 2011లో కాంటూర్ సర్వే జరపగా 2 నుంచి 3 అడుగుల మేర భూమి కుంగినట్టు నిర్ధారించారు. గడిచిన 15 ఏళ్లుగా ఎటువంటి సర్వే జరగలేదు. భూమి కుంగి సముద్ర ఆటుపోట్లకు నీరు ఎగదన్ని డ్రెయిన్లు, వేలాది ఎకరాల భూములు ముంపు బారిన పడుతున్నాయి. డ్రెయిన్ల నుంచి ముంపు దిగక పర్ర భూములు ఆక్రమణకు గురై రైతాంగం నష్టపోతోంది. వీటిపై ప్రభుత్వం అధ్యయనం చేయాల్సి ఉంది. రామేశ్వరం మొగలో 450 ఎకరాల పర్రభూమి, కూరవరం మొగ వద్ద సుమారు 1500 ఎకరాల పర్రభూమి, శంకరగుప్తం మొగ వద్ద పర్రభూమి ఆక్రమణలకు గురై ఏటా ఇసుక మేటలతో మొగలు మూసుకుపోతున్నాయి. ముఖ్యంగా పర్ర భూముల్లో అనధికార ఆక్వాసాగు వల్ల ముంపు పెరిగి వరి పొలాలు, కొబ్బరి తోటలకు ముంపు సమస్య వెన్నాడుతోంది. సముద్ర మట్టం, భూమట్టాలకు వ్యత్యాసం చూపే కాంటూర్ సర్వేచేసి భూరక్షణ చర్యలు చేపట్టి తీర మండలాలను కాపాడుకోవాల్సి ఉంది.


ఓఎన్జీసీ పనుల వల్లే భూమి కుంగింది



ఓఎన్జీసీ వంటి సంస్థల కార్యకలాపాలు, చమురు నిక్షేపాల వెలికితీత వల్ల భూమి కుంగి రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. 2011లో కాంటూర్ సర్వే జరగ్గా రెండు నుంచి మూడు అడుగుల మేర భూమి కుంగినట్టు నిర్ధారణ చేశారు. మళ్లీ కాంటూర్ సర్వే జరపాలి. సముద్ర తీరంలో పర్ర భూములను, ఆక్రమణల చెర నుంచి రక్షిస్తేనే రైతులకు ముంపు నుంచి మేలు జరుగుతుంది.

- యాళ్ల బ్రహ్మానందం, కోనసీమ రైతు పరిరక్షణ సంఘు అధ్యక్షుడు

కోనసీమ గుండెలపై కుంపటిలా ఓఎన్జీసీ కార్యకలాపాలు



కోనసీమ ప్రాంతంలో దశాబ్దాలుగా ఓఎన్జీసీ కార్యకలాపాల ద్వారా అపారంగా చమురు, గ్యాస్ నిక్షేపాలు తరలిస్తున్నారు. కాంటూర్ సర్వే ద్వారా భూమి కుంగినట్టు నిర్ధారణ అయింది. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు, ఓఎన్జీసీ సంస్థలు ప్రత్యేక దృష్టి సారించాలి. ఇకపై ఓఎన్జీసీ సిస్మిక్ సర్వేలు ఆపాలి. తీర ప్రాంత రక్షణ చర్యలు చేపట్టాలి.

- డీఎస్ఎన్ రాజు, పర్యావరణవేత్త

ఆరు సొసైటీలకు పాలకవర్గాలు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

అమలాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న పలు సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రాతినిధ్యం వహించే పి.గన్నవరం నియోజకవర్గంలోని పలు సొసైటీలకు త్రిసభ్య కమిటీలు నియమించారు. నగరం పీఏసీఎస్‌కు ఈలి శ్రీనివాసరావు చైర్మన్‌గాను, కాకి శ్రీనివాస్, ఎం.సత్యనారాయణలను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీచేశారు. అంబాజీపేట మండలం ముక్కామల సొసైటీకి కుడుపూడి రాంబాబును చైర్‌పర్సన్‌గాను, రాకుర్తి ప్రసాద్, యాళ్ల వెంకటసత్యనారాయణలను సభ్యులుగా నియమించింది. అయినవిల్లి మండలం సిరిపల్లి సొసైటీ అధ్యక్షునిగా బిక్కిన వీరేశ్వరజయకుమార్‌ను చైర్‌పర్సన్‌గాను, బొక్కా శ్రీవెంకటేశ్వరరావు, కోడూరి శ్రీలక్ష్మిలను సభ్యులుగాను నియమించారు. అలాగే పి.గన్నవరం మండలం నాగుల్లంక సొసైటీ అధ్యక్షులుగా పాలూరి ఫణీంద్రరావును చైర్‌పర్సన్‌గాను, బయ్యా వినోద్‌కుమార్, కడలి శ్రీరామనరసింహమూర్తిలను సభ్యులుగాను నియమించారు. మామిడికుదురు మండలం పాశర్లపూడిలంక సొసైటీ అధ్యక్షుడిగా అప్పన వీరబాబు, చైర్‌పర్సన్‌గాను, ఇంజే నాగేశ్వరరావు, కుడుపూడి వెంకటేశ్వరరావులు సభ్యులుగా నియమితులయ్యారు. పాశర్లపూడి సొసైటీకి మందా గాంధీ చైర్‌పర్సన్‌గాను, యర్రంశెట్టి దుర్గారాజేశ్వరి, బొంతు మహాలక్ష్మినాగకుమారిలను సభ్యులుగా నియమించారు.

కళాకృతులు!

మొక్కల బొమ్మలకు పెరుగుతున్న క్రేజ్

కొత్త పంథా ఎంచుకుంటున్న యువ రైతులు









(ఆంధ్రజ్యోతి - కడియం)

దేశంలోనే ప్రముఖ గార్డెన్స్‌లో కనువిందు చేసే మొక్కల బొమ్మలు ఇప్పుడు కడియం నర్సరీల్లో సందడి చేస్తున్నాయి. గతంలో ఈ మొక్కను పెంచి, పోషించి బొమ్మల ఆకృతిలో తీర్చిదిద్దడానికి ఆయా గార్డెన్స్ నిర్వాహకులకు చాలాకాలం పట్టేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. నర్సరీల్లోనే ఈ మొక్కల బొమ్మలను అద్భుతంగా తయారుచేసి గార్డెన్స్‌లకు, కార్పొరేట్ కంపెనీలకు ఖరీదైన గృహ యజమానులకు విక్రయిస్తున్నారు. అందుకనే ఈ మొక్కల బొమ్మలకు విశేష ఆదరణ పెరుగుతోంది. ఇప్పటికే పలువురు ఈ మొక్కల బొమ్మలను తీర్చిదిద్దగా తాజాగా కడియం మండలం పొట్టిలంక గ్రామంలో మురుగన్ నర్సరీ యువకుడు దూలం ధనరాజు తయారుచేసిన మొక్కలు కొత్త ట్రెండ్‌ను సృష్టిస్తున్నాయి.

● బొమ్మల తయారీ స్ఫూర్తితో..

చదువుకునే సమయంలో ఆటబొమ్మలు చేయడం ధనరాజుకు అలవాటు. చెక్కతో, మట్టితో తయారుచేసేవాడు. తర్వాత అయ్యప్పస్వామి మందిరాలు, పెళ్లిళ్లలో ఆకృతులు చేయడంలోనూ దిట్ట. అదిప్పుడు ఈ మొక్కల రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. పొట్టిలంకలో నర్సరీ నిర్వహిస్తున్న ఈ యువకుడు ఆలమూరు మండలం మడికి గ్రామం. చెముడులంక ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివి రాజమహేంద్రవరం కూరగాయల మార్కెట్‌లో, మడికి కూరగాయల మార్కెట్‌లో గుమస్తాగా పనిచేశాడు.

● 50 సెంట్ల భూమిని కౌలుకి తీసుకుని..

50 సెంట్లు భూమిని కౌలుకి తీసుకుని తన ప్రయత్నం ప్రారంభించాడు. యూట్యూబ్‌లో చూసి ఏ ఆకారాలు మొక్కలు బొమ్మలుగా మారిస్తే ఆకర్షణీయంగా ఉంటుందో ఆలోచించాడు. గిటారి, చెస్‌బోర్డులో గుర్రం, ఇంటి ఆవరణ లైటు, అందమైన పుష్పం వంటి మొక్కల తయారుపై దృష్టి పెట్టాడు. ఈ మొక్కల తయారీకి నేర్పరితనం కలిగిన కూలీలు కావాల్సి ఉంటుంది. తీగజాతి మొక్కను ముందుగా తయారు చేసుకున్న బొమ్మల ఆకారంలో ఇనుపమెస్‌లకు వీటిని అల్లుతారు. ఈ మొక్క కావాల్సిన ఆకారం వచ్చేవరకు కటింగ్ చేస్తూ ఉండాలి. ధనరాజు కూలీలు లేకుండా తానే ఈ బొమ్మలను రూపుదిద్దుతున్నాడు.

● విభిన్నంగా మొక్కలు తయారు చేయాలని..



చదువు అయ్యాక కొంతకాలం కూరగాయల మార్కెట్‌లో గుమస్తాగా చేశాను. అయితే తనే సొంతంగా ఏదైనా చేయాలనే తపన ఉండేది. బొమ్మలు వేయడంలో ఆసక్తి ఉండేది. ఆ అభిరుచినే ఉపాధిగా ఎందుకు మలుచుకోకూడదనే ఆలోచన వచ్చింది. అర ఎకరం భూమి లీజుకు తీసుకుని టెర్మినేలియా గ్రీన్, ఫాక్స్‌టెయిల్ వంటి మొక్కలు తయారుచేసి విక్రయించేవాడిని. అయితే ఈ రకాలు అందరూ చేస్తున్నారు. మామూలు నర్సరీ మొక్కల తయారు కంటే పెట్టుబడి ఎక్కువయినప్పటికీ మనం బిన్నంగా చేయాలని ఆలోచించి ఈ రకంగా మొక్కల బొమ్మలు తయారు చేయడం ప్రారంబించాను. **- దూలం ధనరాజు, నర్సరీ నిర్వాహకుడు పొట్టిలంక, కడియం మండలం**

నేడు కాకినాడ కలెక్టరేట్‌లో

ధాన్యం సేకరణపై సమీక్ష

» హాజరుకానున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

» ఐదు జిల్లాల అధికారులతో ధాన్యం సేకరణపై ప్రత్యేక కార్యాచరణ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌సీజన్‌లో ధాన్యం సేకరణ కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించేందుకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం కాకినాడకు విచ్చేస్తున్నారు.కాకినాడ కలెక్టరేట్‌లో ఉదయం 10.15గంటలకు సమావేశం అరంభమవుతుంది. కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన జేసీలు, సివిల్ సప్లయిస్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు, ఇతర సంబంధితశాఖల అధికారులు పాల్గొంటారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఐదు జిల్లాల పరిధిలో ఏ మేరకు వరిపంటను సాగు చేశారు. ఏఏ రకాల వరివిత్తనాలు నాటారు. ఎంతమేరకు ఉత్పత్తి వస్తోంది.. వంటి అంచనాలపై చర్చిస్తారు. ధాన్యం సేకరణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతు సేవా కేంద్రాల ద్వారా సేకరించే సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షిస్తారు. ధాన్యం సేకరణ సమయంలో మిల్లర్లు రైతులకు అందించాల్సిన సహకారంపై సూచనలు ఇస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలోకి ధాన్యం సొమ్ములు జమ చేస్తోంది. ఇందులో ఏమైనా ఇబ్బందులు ఉంటే మంత్రి దృష్టికి తీసుకురావొచ్చు. ధాన్యం సేకరణ కార్యాచరణ ప్రణాళికపై ఐదు జిల్లాల అధికారులు మంత్రి ముందు ప్రజంటేషన్ ఇస్తారు. ఏ ఏ జిల్లాల్లో ఏ మేరకు సేకరణ చేయగలమో వివరిస్తారు. ధాన్యం సాగులో రాష్ట్రంలోనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ నేపథ్యంలో ఈఐదు జిల్లాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్‌పెట్టింది. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ కమిషనర్ సౌరబ్‌గౌర్, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పాల్గొంటారు.

పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల పర్యటన షెడ్యూల్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం ఉదయం 5గంటలకు కాకినాడ జీఆర్‌టీ హోటల్‌కు చేరుకుంటారు. అనంతరం ఉదయం 10.15గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షకు హాజరవుతారు. సమీక్ష ముగిసిన తర్వాత మధ్యాహ్నం 2.30గంటలకు రైస్‌మిల్లర్లు, రైతులు, పీఏసీఎస్ ప్రతినిధులతో సమావేశమవుతారు. 5.30గంటలకు ముగిస్తారు. సాయంత్రం 6గంటలకు జీఆర్‌టీకి చేరుకుంటారు. తర్వాత విజయవాడకు పయనమవుతారు.

శ్రీలంక సముద్ర జలాల్లో..

చిక్కుకున్న మత్స్యకారులు

» విడుదలకు ఫలించిన కాకినాడ ఎంపీ ఉదయ్ కృషి

కాకినాడ క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సముద్ర జలాల్లో వేట సాగిస్తున్న సోనాబోటు నావిగేషన్ వ్యవస్థలో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా పొరపాటున శ్రీలంక దేశ సముద్ర జలాల్లోకి ప్రవేశించి అక్కడ జైల్లో మగుతున్న కాకినాడ మత్స్యకారులు ఎట్టకేలకు విడుదలయ్యారు. దీంతో మత్స్యకారుల విడుదలకోసం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ నెలరోజులుగా చేసిన కృషి ఫలించింది. గతనెల 4వతేదీన కాకినాడ, జగన్నాథపురానికి చెందిన పంతాడి బ్రహ్మానందంతోపాటు మరో ముగ్గురు మత్స్యకారులు అక్రమంగా తమ సముద్ర జలాల్లోకి ప్రవేశించారని శ్రీలంక కోస్ట్‌గార్డ్ అధికారులు అదుపులోకి తీసుకుని జాఫ్నా జైల్లో నిర్బంధించారు. అదే రోజు విషయం తెలుసుకున్న ఎంపీ వెంటనే స్పందించి శ్రీలంకలో భారత కాన్సుల్ జనరల్ అధికారి సాయిమురళీతో ఫోన్ మాట్లాడి పరిస్థితి వివరించడంతోపాటు ఎప్పటికప్పుడు డిల్లీలో విదేశాంగశాఖ అధికారులను సంప్రదించి మత్స్యకారుల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు గురువారం జాఫ్నా కోర్టు నలుగురు మత్స్యకారులను విడుదల చేయగా వారి బోటును తిరిగి అప్పగించారు. మత్స్యకారులు మరో రెండురోజుల్లో కాకినాడకు చేరుకోనున్నారు. మత్స్యకారుల విడుదల కోసం అవిశ్రాంత పోరాటం చేసిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌కు మత్స్యకార సంఘ నాయకులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిభకు ప్రోత్సాహం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పలువురు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటారు. బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలనే ఆసక్తిగా ఉన్నా.. వారికి సరైన ప్రోత్సాహం లభించదు. అలాంటి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)ను ప్రారంభించింది. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే పేద విద్యార్థులను ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యం.

» ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు కేంద్రం సాయం

» ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తులకు ఆహ్వానం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్(ఏపీ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) విభాగం ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పథకం కింద పరీక్ష నిర్వహించి, ఎంపికైన అభ్యర్థులకు స్కాలర్‌షిప్ అందిస్తారు. అర్హులకు తొమ్మిది, పది, ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతనాలు అందజేస్తారు.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

ఎన్‌ఎంఎంఎస్ కోసం హెచ్‌టీటీపీ://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఏడో తరగతిలో 55 శాతం మార్కులు కచ్చితంగా ఉండాలి. ఈ ఏడాది పరీక్షకు ఈ నెల నాలుగో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అక్టోబర్ 30 నాటికి దరఖాస్తు గడువు పూర్తికానుంది. డిసెంబర్ ఏడో తేదీన పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నాపత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో ఉంటుంది. మేధస్సుకు పదును పెట్టేలా 90 ప్రశ్నలు, గణితం 20, సోషల్ 35, సైన్స్ 12, ఎస్ఎస్ 11 ప్రశ్నలు ఉంటాయి. ఉత్తీర్ణత పొందినవారు 8, 9 తరగతుల్లో 55 శాతం, పదోతరగతి 60, ఇంటర్ ప్రథమ, ద్వితీయం 55 శాతం చొప్పున మార్కులు సాధిస్తేనే ఉపకార వేతనాలు లభిస్తాయి. విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.మూడున్నర లక్షలకు మించి ఉండకూడదు.

ఏడాదికి 200 మందికి పైగా..

కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షను గత కొన్నేళ్లుగా నిర్వహిస్తూ వస్తోంది. ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులను ప్రోత్సహిస్తోంది. గత నాలుగేళ్లుగా ఏడాదికి సుమారు 200 మందికిపైగా విద్యార్థులకు ఈ ఉపకార వేతనాలు అందజేస్తోంది.



శిక్షణ పొందుతున్న నూతన ఎంపీడీవోలనుద్దేశించి ప్రసంగిస్తున్న కమిషనరు ముత్యాలరాజు

ఉద్యోగులు పనితీరు మెరుగుపరుచుకోవాలి

శిక్షణ పొందుతున్న ఎంపీడీవోలకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కమిషనరు రేవు ముత్యాలరాజు సూచన

సామర్లకోట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు పనితీరు మెరుగుపరుచుకోవాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కమిషనరు రేవు ముత్యాలరాజు పేర్కొన్నారు. ఎంపీడీవోలుగా ఇటీవలే ఉద్యోగోన్నతి పొంది కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న వారితో ఆయన కొద్దిసేపు మాట్లాడారు. ఉద్యోగంలో ప్రతిరోజూ ప్రతి స్థాయిలో సమస్యలు ఎదురవుతుంటాయని, వాటిని తమ నైపుణ్యంతో సమర్థంగా ఎదుర్కోవాలన్నారు. ప్రతిరోజూ ఎదురవుతున్న సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో గుర్తించి అదే తీరులో పరిష్కరిస్తే ఇబ్బందులు ఉండవన్నారు. అప్పుడే ఉద్యోగ జీవితం సంతృప్తికరంగా ఉంటుందని, శిక్షణల ద్వారా పరిపాలనా నియమావళిపై సమగ్ర అవగాహన పొంది సత్ఫలితాలు సాధించవచ్చన్నారు.

సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం పనితీరు సంతృప్తికరంగా ఉందని ముత్యాలరాజు పేర్కొన్నారు. గురవారం ఆయన శిక్షణ తరగతులు, అధికారులకు వసతి, భోజన సదుపాయాలు, శిక్షణా కేంద్ర ఆవరణలో పచ్చదనంలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రిన్సిపాల్ కేఎస్వీ ప్రసాదరావు ద్వారా తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. సువిశాలమైన ఆవరణ ఉన్నందున శిక్షణ తరగతులకు వసతులు పెంచుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. వైద్య, విద్య, ఇంజనీరింగ్ వంటి ఇతర ప్రభుత్వ శాఖల శిక్షణలు కూడా ఈటీసీ ఆవరణలో నిర్వహించుకునేలా ప్రణాళికలు రూపొందించుకునేందుకు జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో చర్చించాలన్నారు. ఇందుకు నిర్వహణా కమిటీ సభ్యుల నుంచి సూచనలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. అధ్యాపకులతో సమావేశమై శిక్షణ తీరుతెన్నులపై సమాచారాన్ని రాబట్టారు. ప్రతి ఉద్యోగికీ కేడర్‌లో పనితీరు మెరుగుపరుచుకునేందుకు శిక్షణలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం శిక్షణ కేంద్రం ఆవరణలో ఒక మొక్కను కమిషనరు ముత్యాలరాజు నాటారు. ప్రిన్సిపాల్ ప్రసాదరావు, తూర్పు గోదావరి జిల్లా జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు, కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి రవి కుమార్, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, జేఎన్టీయూకే ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాసు, డీడీవోలు శ్రీనివాసు, విజయభాస్కర్ పాల్గొన్నారు.





వేదాశీర్వచనం పొందుతున్న సమగ్ర శిక్షా ప్రాజెక్టు రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసరావు, సత్యదేవుడి దర్శనానంతరం ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్

సత్యదేవునికి ప్రముఖుల పూజలు

అన్నవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ గురువారం విచ్చేశారు. ఆయనకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం జవహర్‌కు పండితులు వేదాశీర్వచనం ఇవ్వగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ అన్నవరం దేవస్థానంలో పనిచేస్తున్న ఎస్సీ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఉద్యోగాలు, పదోన్నతుల్లో ఎస్సీ రిజర్వేషన్ అమలవుతోందా అని అడిగి తెలుసుకున్నారు. తమకు ఎటువంటి ఇబ్బందులూ లేవని వారు సమాధానమిచ్చారు. దేవస్థానంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో ఎస్సీ రిజర్వేషన్ పాటించాలని ఈవోకు మంత్రి సూచించారు.

సమగ్ర శిక్షా డైరెక్టర్ (ఐఏఎస్) బి.శ్రీనివాసరావు సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. రెవెన్యూ ప్రొటోకాల్ అధికారి భాస్కరప్రసాద్ పాల్గొన్నారు.

ఉమ్మడి 'తూర్పు'లో 16 మందికి ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి

సామర్లకోట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలోని పలు మండల పరిషత్ కార్యాలయాల్లో ఏవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలుగా పనిచేస్తున్న 16 మందికి ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించారు. వీరు తక్షణం ఆయా మండలాల్లో బాధ్యతలు చేపట్టాలని జడ్పీసీఈవో వీవీఎస్ లక్ష్మణరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

- ఏలేశ్వరం ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న కె.వెంకట సూర్యనారాయణను పెద్దాపురం ఎంపీడీవోగా నియమించారు.ఇప్పటివరకు పెద్దాపురం ఎంపీడీవోగా పనిచేసిన డి.శ్రీలలిత విశాఖ జిల్లా డీవీవోగా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు.
- యు.కొత్తపల్లి డిప్యూటీ ఎంపీడీవో కె.హరికృష్ణ సత్యారెడ్డిని గండేపల్లి ఎంపీడీవోగా నియమించారు.
- రాజమహేంద్రవరం ఎంపీడీవోగా అక్కడే డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న కేఎస్ ఆర్మ్‌స్ట్రాంగ్‌ను నియమించారు.
- అల్లవరం ఎంపీడీవోగా ఉప్పలగుప్తం డిప్యూటీ ఎంపీడీవో పీఆర్‌సీ రాజ్‌కుమార్‌ను నియమించారు.
- ఉప్పలగుప్తం ఎంపీడీవోగా అనకాపల్లి జిల్లా డ్వామా ఏవో డి.కృష్ణను నియమించారు.
- పి.గన్నవరం ఎంపీడీవోగా మలికిపురంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న జి.మల్లికార్జునరావును నియమించారు.
- కపిలేశ్వరపురం ఎంపీడీవోగా అనకాపల్లి జిల్లా రావికమతం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న హెచ్.భానోజీరావును నియమించారు.
- అంబాజీపేట ఎంపీడీవోగా కాట్రేనికోన డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న బి.మమతను నియమించారు.
- మలికిపురం ఎంపీడీవోగా ముమ్మిడివరం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న సీహెచ్ లక్ష్మీకల్యాణిని నియమించారు.
- సఖినేటిపల్లి ఎంపీడీవోగా కె.గంగవరం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న కేఎస్ గౌరీ కుమారిని నియమించారు.
- యు.కొత్తపల్లి ఎంపీడీవోగా శంఖవరం మండల పరిషత్ కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న ఎ.లక్ష్మీరెడ్డిని నియమించారు.
- అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల ఎంపీడీవోగా విశాఖ జిల్లా అనంతగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న ఏవీవీ కుమార్‌ను నియమించారు.
- కాకినాడ రూరల్ ఎంపీడీవోగా కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న బి.కృష్ణగోపాల్‌ను నియమించారు.
- తాళ్లరేవు ఎంపీడీవోగా అల్లవరం మండల పరి షత్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న బి.లక్ష్మణరావును నియమించారు.
- గోకవరం ఎంపీడీవోగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ఎంపీడీవో కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న సీహెచ్ రవికుమార్ వర్మను నియమించారు.
- శంఖవరం ఎంపీడీవోగా కృష్ణా జిల్లా పామర్రు డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న జి.కిషోర్‌ను నియమించారు.

అయోధ్య బాలరాముడికి ప్రత్యేక విల్లంబు



శ్రీనివాసశాస్త్రికి విల్లంబు అందజేస్తున్న దృశ్యం

మండపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని బాలరాముడికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం మారేడుబాకకు చెందిన శిల్పి వాసా శ్రీనివాసరావు 9 కిలోల వెండిపై రెండు తులాల బంగారు పూతతో విల్లంబు (బాణం) తయారు చేశాడు. ఐదుగురు కళాకారులు 15 రోజులు శ్రమించి ఏడు అడుగులు ఎత్తు, 9.5 కిలోల రాగి, రెండు కాసులు బంగారంతో పూత పూశారు. ఇందుకు రూ.2 లక్షలు వ్యయమైందని శ్రీనివాసరావు చెప్పాడు. గురువారం దీనిని అయోధ్యకు చెందిన శ్రీరామ వృక్షం ట్రస్టు వ్యవస్థాపకుడు చల్లా శ్రీనివాసశాస్త్రికి శ్రీనివాసరావు అందజేశారు.

సిద్ధివినాయకునికి వెండి పళ్లెం బహూకరణ

అయినవిల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలోని శ్రీసిద్ధి వినాయకస్వామిని విశాఖపట్నం జిల్లా తగరపువలసకు చెందిన కటకం అవినాష్-సాహిత్యశృతి దంపతులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి రూ.లక్షా 35వేల విలువైన ఒక కిలో 50 గ్రాముల వెండి పళ్లెం బహూకరించారు. దాతలకు ఆలయ ప్రధానార్చకుడు వేదాశీర్వచనం అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి అభినందించారు.



వెండి పళ్లెం అందజేస్తున్న అవినాష్-సాహిత్య శృతి దంపతులు

అండర్-14, 17 బాలబాలికల క్రీడా పోటీలు ప్రారంభం

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా 68వ పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 బాలబాలికలుకు క్రీడా పోటీలు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీనివాస్‌కుమార్, సుధారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎండీ షరీఫ్, కాకినాడ అర్బన్ ఎంఈవో రవి, కాకినాడ రూరల్ ఎంఈవో టీవీఎస్ రంగారావు హాజరయ్యారు. వారు జాతీయ పతాకానికి గౌరవవందనం చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆర్చరీ, సెపక్‌తక్రా, గట్కా క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, కార్యదర్శి వి.మాచారిరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు పాల్గొన్నారు.



ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఆ వేతన..

- పామాయిల్ గెలల కోత కార్మికులకు చాలీచాలని కూలీ
- కుటుంబాన్ని పోషించేందుకు తప్పని ఆర్థిక భారం
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వైనం
- పట్టించుకోని రైతులు, ప్రభుత్వం



చెట్ల నుంచి గెలలు సేకరిస్తున్న కార్మికుడు

జగ్గంపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మనం నిత్యం వినియోగించే పామాయిల్ నూనె ముడిసరుకుకు వాడే పామాయిల్ గెలలను తీసే కోత కార్మికులు ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. సరైన కూలీ (వేతనం) అందక ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే... కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గంలో పామాయిల్ కోత కార్మికులు దాదాపుగా రెండు వేల మంది వరకు ఉన్నారు. వీరంతా చాలీచాలని కూలీలతో వారి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఇటీవలకాలంలో ఉభయగోదావరి జిల్లాలతో పాటు అల్లూరి జిల్లా మన్యం ప్రాంతాలలో అధికశాతం పామాయిల్ తోటలు వేయడంతో పాటు కర్నాటక రాష్ట్రంలో కూడా ఈ పంటను పండించటం జరుగుతోంది. ప్రతి ఇంటికీ నిత్యవసర వస్తువుగా పామాయిల్ అవసరం కాబట్టి దీన్ని ఆసరాగా తీసుకుని రాష్ట్రంలోని ఉభయ గోదా వరి జిల్లాలతో పాటు ఏజెన్సీలో విద్యుత్ బోర్లు, వర్షాధారంగా ఈ పంటను సాగుచేస్తున్నారు.గత రెండుసంవత్సరాల నుంచి ఈ పామాయిల్ ధర టన్ను రూ. 16 వేలు నుంచి రూ.20 వేలు వరకూ నడుస్తూ ఉంది. అయితే ఈ పామాయిల్ గెలలను చెట్టు నుంచి వేరు చేసి ఫ్యాక్టరీకి తరలించడానికి నైపుణ్యం గల కార్మికులు అవసరం అవుతారు. దీనిలో భాగంగా జగ్గంపేట నియోజకవర్గంలో పామా యిల్ కోత కార్మికులు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. తమ తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా ఈ వృత్తినే నమ్ముకుని ఉన్నారు. రోజుకి రూ. 700 కూలీ మాత్రమే కిడుతుందని వారు అంటున్నారు. పామాయిల్ ధరలు పెరుగుతూ రైతులు, పరిశ్రమలు లాభాల బాటలో ఉన్నారు. కానీ తమ ప్రాణాలకు తెగించి చెట్టు నుంచి గెలలను వేరుచేసే సమయాల్లో పాము కాట్లకు, విద్యుత్‌వైర్లు తగిలి ప్రాణాలు కోల్పోతున్నారు. వీరికి ఎటువంటి బాసట లేకపోవడంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని పలువురు కార్మికులు వాపోతున్నారు.

ప్రమాదాల బారిన పడుతున్నాం



- టేకుమూడి వీరబాబు, సంఘం ప్రెసిడెంట్

ఉభయ గోదావరి జిల్లాలే కాకుండా, ఇతర రాష్ట్రాలకు కూడా పామాయిల్ గెలలు కోతకు వెళుతుంటాం. ఇలా గెలలో కోసే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నాం. దీంతో మా కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ప్రభుత్వం మా కార్మికులకు బీమా సౌకర్యంతో పాటు ఆర్థిక భరోసా కల్పించాలి.

పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలి

- పిల్లి శ్రీను, సంఘం ఉపాధ్యక్షుడు



మేము ప్రమాదాల బారిన పడినప్పుడు రైతు ఎంతో కొంత సాయం చేస్తున్నారు. అలాగే పరిశ్రమలు, ప్రభుత్వం కూడా ఈ సాయం అందించడంతో పాటు మాకు భద్రత కల్పించాలి. అప్పుడే మేము కొంత వరకు ఆర్థిక భారం నుంచి ఉపశమనం పొందగలుగుతాం.

అంతర్వేది హుండీ ఆదాయం
రూ. 35,62,444 లక్షలు



స్వామివారి హుండీని లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది, తదితరులు

అంతర్వేది, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. జిల్లా దేవాదాయ శాఖాధికారి బీ.సత్యనారాయణ పర్యవేక్షణలో అమలాపురం తనిఖీ అధికారి జే.రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. మొత్తం 83 రోజులకు గాను ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ. 35,07,678 లక్షలు, గుర్రాలక్కమ్మ అమ్మవారి హుండీ ద్వారా రూ.14,679 వేలు, అన్నదాన హుండీ ద్వారా రూ.40,087 వేలు, మొత్తం రూ.35,62,444 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు.

అలాగే నాలుగు గ్రాముల బంగారం, 39 గ్రాముల వెండి వస్తువులు, పలు దేశాల విదేశీ కరెన్సీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, సూపరింటెండెంట్ విజయసారథి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్

దేవరపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం జిల్లాలోని సబ్ జూనియర్ బాలురు, బాలికల సెపక్‌తక్రా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా జట్టుకు విద్యార్థులను ఎంపిక చేసినట్టు రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. వీరంతా ఈనెల 13, 14 తేదీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. బాలుర విభాగంలో ... కే.అభిలాష్ (దొమ్మేరు), జే.ప్రకాశ్ (రామన్నపాలెం), వీ.హర్ష (చిన్నాయిగూడెం) ఎస్‌జీ శ్రీరామ్ (చిన్నాయిగూడెం), బాలికల విభాగంలో.. ఎం.తేజస్వి (రామన్నపాలెం), డీ.అంజలి (రామన్నపాలెం), కే.సాయి శ్రీలక్ష్మి (రామన్నపాలెం), నీరజ (చిన్నాయిగూడెం),కే.స్రవంతి (చిన్నాయిగూడెం) ఉన్నారు. కార్యక్రమంలో రామన్నపాలెం పీఈటీ సరస్వతి, పలు స్కూళ్ల పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి ఒకరి మృతి

కె.గంగవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కే. గంగవరం మండలంలోని సుందరపల్లిలో గురువారం గడ్డి మందు తాగి కుంచెనపల్లి గనిరాజు (47) మృతిచెందాడు. పామర్రు ఎస్‌ఐ ఎస్‌కే జానీబాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గనిరాజు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడి మానసికస్థితి సరిగా లేకపోవడంతో అమలాపురంలో చికిత్స పొందుతున్నాడు. కాగా, ఇటీవల కొన్ని రోజులుగా చికిత్స చేయించకోవడం మానేశాడు. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనులు సరిగ్గా చేయలేకపోతున్నానని తీవ్ర మనస్థాపం చెంది బుధవారం గడ్డిమందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

22 నుంచి విజయదుర్గా పీఠంలో దేవీ నవరాత్రులు



వెదురుపాక విజయ దుర్గా అమ్మవారు

రాయవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం వెదురుపాక విజయ దుర్గా పీఠంలో ఈనెల 22 వ తేదీ నుంచి వచ్చేనెల రెండు వరకు దేవీ శరన్నవ రాత్రులు నిర్వహిస్తున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు విలేకరులకు తెలిపారు. గురువారం పీఠంలో పీఠాధిపతిగాడ్ చేతులమీదుగా ఉత్సవాల కరపత్రాన్ని విడుదల చేశారు. అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు మాట్లాడుతూ 2వ తేదీ ఉదయం 8:19 నిమిషాలకు గురుహోరలో అమ్మవారి మూలవిరాట్ వద్ద కలశ స్థాపనతో పూజలలు ప్రారంభమౌతాయన్నారు. ప్రతిరోజూ అమ్మ వారికి భక్తులచే సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు, ఉదయం 9 గంటలకు సప్తశతి పారాయణ, 10 గంటలకు దేవీ భాగవత ప్రవచనాలు, సాయంత్రం నాలుగు గంటలకు శ్రీలలితా సహస్ర నామ పారాయణ, సాయంత్రం అమ్మవారికి సువాసినీల పూజ, చతుర్వేదస్వస్తి, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన ఉంటాయని చెప్పారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

అది ఆకతాయి చర్యే

- ఎటువంటి మతపరమైన ఉద్దేశాలు లేవు
- కేవలం మతపరమైన జెండాలనే ప్రదర్శించారు
- మతసామరస్యాన్ని కాపాడేందుకు ముస్లింల కృషి
- ముస్లిం జేఏసీ ప్రతినిధి జవహర్ అలీ



కాకినాడలో విలేకరులతో మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ ప్రతినిధి జవహర్ అలీ

కాకినాడ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈనెల 5న మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జరిగిన ర్యాలీలో మత విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలేవీ జరగలేదని, కొందరు యువకులు ఆకతాయిగా జెండాలను ప్రదర్శించారని ముస్లిం జేఏసీ ప్రతినిధి జవహర్ అలీ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన గురువారం కాకినాడలో ఆయన ముస్లిం జేఏసీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ర్యాలీలో యువకులు ప్రదర్శించిన జెండా కేవలం మతపరమైనవి తప్ప, పాకిస్థాన్, పాలస్తీనా జెండాలు ఏ మాత్రం కావని తెలిపారు. ర్యాలీ పూర్తిగా శాంతియుతంగా, సామరస్యపూర్వకంగా జరుగుతున్న సమయంలో కొందరు యువకులు తమకు తెలియకుండానే వీటిని ప్రదర్శించారని అన్నారు. కాకినాడలో ముస్లింలు ఎప్పటికీ దేశద్రోహం, విద్రోహ శక్తులకు అనుకూలంగా నిలబడే పరిస్థితి ఉండదని జవహర్ అలీ స్పష్టం చేశారు. పోలీసులు సోషల్ మీడియాలో వచ్చిన వీడియోల ఆధారంగా కేసులు నమోదు చేశారని, ఎఫ్ఐఆర్‌లో వేసిన సెక్షన్లు 302 అండ్ 298, 126, 339, 281, 279ను తాము తీవ్రమైనవాటిగా పరిగణిస్తున్నామన్నారు. ప్రపంచంలో 96 ఇస్లామిక్ దేశాలు న్నాయని, వాటికి సంబంధించి చంద్రుడు, చుక్క ఉన్న జెండాలు ప్రతి ముస్లింల ఇంట, మసీదుల వెంట ఉంటాయని మీడియాకు వివరించారు. పాలస్తీనాలో జరిగిన సంఘటనలకు మద్దతుగా మాత్రమే ఆ యువకులు తిరిగారని వెల్లడించారు. ఆకతాయి చర్యలుగా యువకులు తిరగడాన్ని తాము సమర్థించబోవడం లేదన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని సోషల్ మీడియాలో తమను దేశద్రోహులుగా, విద్రోహ శక్తుల ప్రతినిధులుగా చిత్రీకరించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

-18 సెల్‌ఫోన్లు, 200 నాణేలు, నగదు స్వాధీనం

కాకినాడ క్రైం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న 18 మందిని కాకినాడ త్రీటౌన్ పోలీసులు గురువారం రాత్రి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8,560 నగదు, సుమారు 200 నాణేలు, 18 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా కాకినాడ నగరంలోని పల్లంరాజు నగర్‌లో పవన్ గార్డెన్స్ అపార్ట్‌మెంట్స్ ఫ్లాట్ నెం.4లో జూదమాడుతున్నారని వచ్చిన పక్కా సమాచారంతో త్రీటౌన్ పోలీసులు, స్పెషల్ బ్రాంచి పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు. అనంతరం వారి నుంచి నగదు, నాణేలు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కాపర్ వైర్ దొంగతనం .. ముగ్గురి అరెస్ట్

తొండంగి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి: ఒంటిమామిడి దివిస్ పరిశ్రమలో 1700 కిలోల కాపర్ వైర్ దొంగతనం చేసిన ముగ్గురిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచినట్టు తొండంగి పోలీసులు తెలిపారు. దివీస్ ప్రతినిధులు ఈనెల 6న ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా పరిశ్రమలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన బిట్టుకుమార్, అభిషేక్ కుమార్, దీపక్‌కుమార్ చోరీకి పాల్పడినట్టు తేలిందన్నారు. రాత్రివేళ పలు దఫాలుగా రాగి తీగలను గోడపక్కన పడవేసి, తద్వారా వ్యాన్ సాయంతో స్థానికంగా స్క్రాప్ షాపు నడుపుతున్న వ్యక్తికి అమ్మేశారన్నారు. దీనిపై దర్యాప్తు జరిపి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు వారు తెలిపారు. తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

అటవీ అమరవీరులను స్మరించుకోవాలి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న అటవీఅధికార్లు, ఉద్యోగులు

సంస్మరణ దినోత్సవంలో రాజమహేంద్రవరం సీసీఎఫ్ మూర్తి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సంపదను కాపాడడం కోసం ప్రాణ త్యాగం చేసిన అటవీ అమరవీరులను ప్రతీఒక్కరు స్మరించుకోవాలని రాజమహేంద్రవరం సీసీఎఫ్ బీఎస్ఎన్ మూర్తి అన్నారు. లాలాచెరువు సమీపంలోని గోదావరి మహా పుష్కరవనంలో అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కరవనంలోని అమరవీరుల స్థూపాల వద్ద సీసీఎఫ్ మూర్తి, దివాన్‌చెరువు సమీపంలోని రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ బి.విజయకుమార్, జిల్లాలోని అటవీ అధికార్లు, ట్రైనీలతో కలసి అమరవీరులకు నివాళులర్పించారు. స్మారక స్థూపాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచారు. అనంతరం సీసీఎఫ్ మూర్తి మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడడంలో అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. విజయకుమార్ మాట్లాడుతూ సహజ వనరులను రక్షించడానికి అమరవీరులు చేసిన త్యాగాలను గుర్తు చేశారు, వాటిని మరువకూడదన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో వి.ప్రభాకరరావు, ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శ్రీనివాస్, స్టేట్ సిల్వి కల్చరిస్ట్ శ్రీనివాస్, ఎఫ్ఆర్‌వో దావీదురాజు నాయుడు, డిప్యూటీ రేంజ్ అధికారి చల్లా శ్రీనివాసరావు, అటవీ ఉద్యోగులు, అటవీ అకాడమీలోని డిప్యూటీ డైరెక్టర్లు, ట్రైనీలు, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ విజయకుమార్ బదిలీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఎఫ్‌డీసీఎల్) రీజనల్ మేనేజర్‌గా ఎస్.శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన ఇంతవరకూ ఫారెస్ట్ రీసెర్చ్ అండ్ ఐటీ విభాగం చీఫ్ కన్జర్వేటర్‌గా పనిచేశారు. ఇక ఇక్కడ ఏపీ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బి.విజయకుమార్‌ను శ్రీశైలం ఫారెస్ట్ టైగర్ సర్కిల్ డైరెక్టర్‌గా నియమించారు.

పాము కాటుతో రైతు మృతి

అడ్డతీగల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అడ్డతీగల మండలం దాకోడు గ్రామానికి చెందిన గిరిజన రైతు పొడుగు ప్రసాద్(41) పాముకాటుతో మృతి చెందాడు. ప్రసాద్ బుధవారం తన పొలంలో పనిచేసుకోవడానికి వెళుతుండగా మార్గమధ్యంలో పాముకాటేసింది. వెంటనే సహచరులు అతడిని దుప్పులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు పరిశీలించి ప్రసాద్ అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు.

పీఎఫ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రాంతీయ కమిషనర్ వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న యూనివర్సిటీ అధికారులు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదికవి నన్నయ వర్సిటీలో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్సిటీలోని సిబ్బంది అందరూ పీఎఫ్‌లో భాగస్వాములవ్వాలని,దాని ద్వారా సొమ్ము ఆదా చేసుకోవడమే కాకుండా బీమా, పెన్షన్ ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనకు రూ.లక్ష వరకూ వేతనం పొందే ఉద్యోగులు అర్హులన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎ.మట్టారెడ్డి, సిబ్బంది వెంకటేశ్వర్లు సన్మానించారు. అనంతరం వీసీ ప్రసన్నశ్రీని మర్యాదపూర్వకంగా కమిషనర్ కలవగా మాట్లాడుతూ ఈపీఎఫ్‌తో సిబ్బందికి మేలు కలిగే పలు అంశాలను చర్చించారు.

ఇంటి దొంగ అరెస్ట్

183 గ్రాముల బంగారు ఆభరణాలు రూ.లక్ష నగదు స్వాధీనం



వివరాలు వల్లడిస్తున్న సీఐ నాగదుర్గారావు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నమ్మకంగా పని చేస్తుందని ఎటువంటి నిఘా లేకుండా ఇల్లంతా ఆ పని మనిషికి అప్పగించి వృద్ధురాలైన ఆ యజమాని తన పని తాను చేసుకుంటోంది. ఆమె ఆదమరుపుగా ఉన్న సమయంలో పనిమనిషి ఆ ఇంటిలో ఉన్న 183 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1 లక్ష నగదు అపహరించుకుపోయింది. కట్ చేస్తే కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఉంది. సీఐ ఎం.నాగదుర్గారావు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ బాలాజిచెరువు సెంటర్ సమీపంలోని కొమ్మిరెడ్డి వారి వీధిలో 60 ఏళ్ల బత్తుల కనకదుర్గ, ఆమె కుమార్తె ప్రశాంతి నివాసం ఉంటున్నా రు. ఈ నెల 2న ఆ ఇంటిలో 277 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1 లక్ష నగదు అపహరణకు గురైనట్టు కనకదుర్గ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ నాగదుర్గారావు, క్రైం సీఐ వి.కృష్ణ బృందంతో కలిసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఆ ఇంటి పని మనిషిని నిందితురాలిగా నిర్ధారించారు. గురువారం స్థానిక జగన్నాథపురం, మరిడమ్మపేటకు చెందిన పని మనిషి వనమాడి జగదాంబను ఆమె ఇంటి వద్ద అదుపులోకి తీసుకుని విచారించారు. కనకదుర్గ ఇంట్లోని డబుల్ కాట్ మంచానికి అమర్చిన సీక్రెట్ సొరుగులో ఆమె విలువైన వస్తువులు భద్రపరుస్తుండడాన్ని చాలాకాలంగా జగదాంబ గమనించేది. ఈ నెల 2న ప్రశాంతి బయటకు వెళ్లగా కనకదుర్గ పని చేసుకుంటోంది. ఆ సమయంలో జగదాంబ దొంగతనానికి పాల్పడింది. అయితే బాధితులు ఆందోళనలో ఉండి ఫిర్యాదులో 277 గ్రాముల బంగారం చోరీకి గురైనట్టు తెలిపిందని అయితే 94 గ్రాముల బంగారం కనకదుర్గ ఇంటిలో భద్రంగానే ఉన్నట్టు గుర్తించామన్నారు. నిందితురాలిని అరెస్ట్ చేసినట్టు సీఐ తెలిపారు.

డొంకరాయి నుంచి నీటి విడుదల నిలుపుదల

జెన్‌కో అధికారులు



డొంకరాయి జలాశయం నుంచి నీటిని నిలుపుదల చేసిన దృశ్యం

మోతుగూడెం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదలను గురువారం ఉదయం నుంచి నిలిపివేసినట్టు కాంప్లెక్సు పరిధిలోని జెన్‌కో అధికార్లు తెలిపారు. అల్పపీడన ప్రభావంతో ఇటీవల ఈ ప్రాంతంలో కురిసిన భారీవర్షాలకు డొంకరాయి జలాశయం పూర్తిస్థాయికి చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులుగా కాగా ఈ నెల 5 నాటికి 1035.60 అడుగులకు చేరడంతో జలాశయం నీటి మట్టం పూర్తిస్థాయి చేరుకుంటే ప్రమాదమని భావించి స్థానిక జెన్‌కో అధికార్లు ముందస్తు చర్యల్లో భాగంగా 5వ తేదీ రాత్రి జలాశయం 6వ గేటు ఎత్తి దిగువకు 3 వేలు క్యూసెక్కుల నీటిని విడుదల చేసి నీటి మట్టం 1034 అడుగుల వద్ద స్థిరంగా కొనసాగేలా చర్యలు చేపట్టారు. 4రోజులుగా ఈ ప్రాంతంలో వరద తగ్గుముఖం పట్టింది. దీంతో గురువారం ఉదయం నాటికి డొంకరాయి జలాశయం నీటిమట్టం 1033.90 అడుగులకు తగ్గడంతో నీటి విడుదలను గురువారం ఉదయం నుంచి నిలిపివేసినట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. ఈ నెల 5నుంచి 11వ తేదీ ఉదయం వరకు 759 టీఎం సీల నీటిని దిగువకు విడుదల చేశామని తెలిపారు.అలాగే డొంకరాయి జలాశయం నుంచి పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం 3519 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్టు జెన్‌కో అధికార్లు తెలిపారు. అల్పపీడన ప్రభావంతో ఇటీవల సీలేరు నదీ పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు సీలేరు కాంప్లెక్సు లోని జలాశయాలకు నీటిని సరఫరా చేసే ఆంధ్రా ఒడిశా ఉమ్మడి జలాశయమైన బలిమెల జలాశయంలో ఆంధ్రా వాటాగా గురువారం నాటికి 45.9236 టీఎంసీలు, సీలేరు డొంకరాయి జలాశయాల్లో 12.9701 టీఎంసీలుతో కలుపుకుని మొత్తంగా 58.8937 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని జెన్‌కో అధికారులు తెలిపారు. గురువారం సీలేరు కాంప్లెక్సులోని జల విద్యుత్ కేంద్రాల్లో గ్రిడ్ అధికార్ల ఆదేశాలతో 3.7038మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని స్థానిక అధికార్లు తెలిపారు.

వలసపాకల యూఆర్సీ క్యాంటీన్‌లో వివాదం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వలసపాకల యూనిట్ రన్ క్యాంటీన్ (యూఆర్సీ)లో పనిచేస్తున్న మేనేజర్, ఓ ఉన్నతాధికారి మధ్య తలెత్తిన వివాదం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే వరకు వెళ్లింది. వివరాల్లోకెళితే... కాకినాడ జిల్లాలో పని చేస్తున్న ఆర్మీ సిబ్బంది, రిటైర్డు ఆర్మీ ఉద్యోగస్థులకు రాయితీపై నిత్యావసర సరుకులు, ఎలక్ట్రిక్ పరికరాలను వలసపాకలలో ఏర్పాటుచేసిన ఆర్మీ క్యాంటీన్‌లో పంపిణీ చేస్తారు.కాకినాడకు చెందిన ఆర్మీ ఉన్నతాధికారి ఆగస్టు 22న క్యాంటీన్‌ని సందర్శించిన సమయంలో దాని నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసి, తనపై అకారణంగా ఆగ్రహం వ్యక్తం చేసినట్టు అక్కడ పని చేస్తున్న మేనేజర్.. సన్నిహితులు, సహచార ఉద్యోగస్థుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.ఏ తప్పు చేయకపోయినా తనపై ఆ అధికారి దురుసుగా ప్రవర్తించడంతో వారం క్రితం రాజీనామా చేశారు. రాజీనామా వెనక్కి తీసుకోవాలని రిటైర్డు ఆర్మీ సంఘం నాయకులు సదరు మేనేజర్‌కు సంఘీభావం తెలపడంతో రాజీనామా వెనక్కి తీసుకుంటున్నట్టు మేనేజర్ సికింద్రాబాద్‌లోని ఆర్మీ సెంట్రల్ హెడ్ క్వార్టర్‌కి సమాచారం అందించి, విధుల్లో చేరే నిమిత్తం ఆర్మీ క్యాంటీన్‌లో విధులు నిర్వర్తించేందుకు వచ్చినా సదరు అధికారి అడుకోవడంపై మేనేజర్ ఆందోళన వ్యక్తం చేశారు. తన రాజీనామా ఆమోదించినట్టు తనకు హెడ్ క్వార్టర్స్ నుంచి ఎటువంటి ఉత్తర్వులు అందలేదని, అయినప్పటికీ సదరు కల్నల్ తనను అడ్డగిస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు 8 మంది



రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్, చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బిక్కవోలు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు బిక్కవోలు నుంచి నలుగురు బాలురు, నలుగురు బాలికలు ఎంపికయ్యారని బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు ఐ.శశిభూషణం గురువారం తెలిపారు.ఇటీవల గొల్లల మామిడాడలో జరిగిన జిల్లా స్థాయి అండర్-19 పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారిలో దుళ్ల అలేఖ్య, బండారు చాందినిశ్రీయ, రొంగల శిరీష, బూడి భార్గవి, విసినిగిరి హేమంత్, కైలాష్, తొండాపు వీరమణికంఠ, గుత్తుల నాగవినయ్ ఉన్నారు. వారు ఈ నెల 12 నుంచి 14 వరకూ అనంతపురం జిల్లా ధర్మవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన బాలబాలికలను అసోసియేషన్ సభ్యులు చైతన్య, నరేంద్ర, కృష్ణ ప్రసాద్, మోహన్ అభినందించారు.

చెస్ పోటీలకు ఇద్దరు ...

పందలపాక జడ్పీ హైస్ పాఠశాల నుంచి ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-19 చెస్ పోటీలకు ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పి.లీలాస్వాతి, జి.విమల ప్రతిభ కనబరచిన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.ఈ సందర్భగా విద్యార్థినులతోపాటు పీడీ యువరాజారెడ్డిని హెచ్ఎం, ఎస్‌డీసీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఎస్ఎంసీ చైర్మన్ పంపన వీరసత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

బైక్ చోరీ చేస్తూ గ్రామస్థులకు చిక్కిన దొంగ

రాజానగరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోనగూడెంలో బైక్ చోరీకి పాల్పడుతూ ఒక దొంగ గ్రామస్థులకు చిక్కడంతో అతడికి దేహశుద్ధి చేసి, నిర్బంధించారు. గ్రామంలోని టీ దుకాణం వద్ద పార్క్ చేసిన బైక్ చెంతన ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా సంచరించడాన్ని గమనించారు. కొంతసేపటికి తాళం తీసేందుకు ప్రయత్నిస్తుండగా దొంగను పట్టుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరు పరారుకాగా ఒకడు పట్టుబడ్డాడు. అతడికి గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. ఎన్ని విధాలుగా భయపెట్టినప్పటికీ నోటి నుంచి సరైన సమాధానం రాబట్టలేకపోయారు. చేసేది లేక పోలీసులకు సమాచారం అందించారు.

అమలాపురం


అంతర్వేది పల్లిపాలెం గ్రామంలో గ్రోయిన్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన : ఎమ్మెల్యే దేవ

అంతర్వేది, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో చిట్టచివరి గ్రామమైన అంతర్వేది పల్లిపాలెానికి పోటు నీరుతో వస్తున్న ముంపు సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం గ్రామంలో గురువారం కూటమి నాయకులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. సముద్రం, గోదావరి పోటునీరు అమావాస్య, పౌర్ణమి, వరదల సమయంలో ఎక్కువగా ముంపుకుగురవుతుందని, దీనిపై పూర్తిస్థాయి పరిశీలనచేసి త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు. ద్వారక మండపం, షష్ఠురమాట్, మెరకతోట, ఎరుపల్లివారి గ్రూపులను స్వయంగా వెళ్లి పరిశీలించారు. పల్లిపాలెం గ్రామం కోతకు గురై క్కట్టూ చుట్టూ నీరుచేరి ఉండడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని, ఈ సమస్యకు రూ.60 కోట్లతో గ్రోయిన్లు, రివిటిమెంట్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించామని తెలిపారు. మినీ ఫిషింగ్‌హార్బరుకు మంచినీటి సరఫరా, కరెంటు, విద్యుత్, అప్రోచ్ రోడ్డు నిర్మించి మత్స్య సేకరణ, మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో రోడ్లు, తాగునీరు, విద్యుత్, మౌళిక వసతులు కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. చాలాకాలంగా నిర్లక్ష్యం చేయబడిన ఇళ్ల పట్టాల పంపిణీని ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు. అలాగే లక్ష్మీనరసింహస్వామి పాలకమండలిలో మత్స్యకారులకు ప్రత్యేక స్థానం కల్పించి కొవనాలి కృష్ణమ్మ వారసులను గౌరవిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, గుబ్బల శ్రీను, గెద్దం మహాలక్ష్మిప్రసాద్, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, తిరుమని ఆకార్యులు, పొన్నాల విజయ్, బైరా నాగరాజు, పోతాబత్తుల రాంబాబు, పొన్నాల ప్రభ పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రి కృషి అభినందనీయం

● ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు



ముమ్మిడివరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో చిక్కుకున్న వారిని రక్షించడంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ కృషి అభినందనీయమని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. నేపాల్ అల్లర్లలో చిక్కుకున్న సుమారు 257 మంది తెలుగువారిని రక్షించడంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. గురువారం ముమ్మిడివరంలో టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్షోభంలో ఉన్న నేపాల్ దేశంలో చిక్కుకున్న తెలుగువారిని సన్నద్ధలాకుడు రప్పించడంలో ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ కృషి అభినందనీయమని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. మగటపల్లిలో ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ నేపాల్‌లో చిక్కుకున్న 2015 మంది తెగులువారిని స్వస్థలానికి తీసుకురావడానికి కృషి చేసిన నారా లోకేశ్‌ను అభినందించారు.కార్యక్రమంలో కొలిశెట్టి రాంబాబు, చెల్లింగి సింహాచలం, కొలిశెట్టి నాగభూషణం, నామన నాని పాల్గొన్నారు.

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): రాజకీయ

సంక్షేమాలతోనే రాష్ట్రాభివృద్ధి : టీడీపీ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న కడలి వెంకటేశ్వరరావు

అల్లవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ కూటమి పాలన ప్రజా సంక్షేమాల అమలుతో అభివృద్ధిబాటలో నడుస్తోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం తుర్పులంకలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు అధ్యక్షతన టీడీపీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయని, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో పార్టీ అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. అనంతరం టీడీపీ కూటమి పాలనలో సాధించిన విజయాలను సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ మండల కార్యదర్శి పచ్చిమాల పేరి కొండలు, నాయకులు మందాని సురేష్‌రాజు, పేగిరాజు శ్రీనురాజు, కొల్లు విష్ణుమూర్తి, తోట నరసింహారావు, కోట్లపల్లి రాములు, పడ్డి ఏలీషారాజు, కొప్పాడి నాగరాజు, కొప్పిశెట్టి రామకృష్ణ చిట్టిడి దానయ్యనాయుడు, కాండ్రేగుల సత్యనారాయణ, బళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

జనసైనికుల ఆధ్వర్యంలో రోడ్డుకు మరమ్మతులు


రోడ్డుకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అధ్వానంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆధునీకరణ చర్యలు చేపట్టకపోవడంతో జనసైనికులే నడుం బిగించి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. ముమ్మిడివరం-శాటిలైకోన ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తి అధ్వానంగా మారింది. ఈ రోడ్డును రూ.23.52 కోట్లతో అభివృద్ధి కరించేందుకు 2022 మే 13న నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం ముందుకు సాగలేదు. 9.330 కిలోమీటర్ల నిడివిగల ఈ ఆర్‌అండ్‌బీ రోడ్డు పెద్దపెద్ద గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో జనసైనికులు సోమిదేవరపాలెానికి చెందిన తాడిరాంబాబు, తాడి వెంకటరమణ, తాడి శ్రీకాంత్, తాడి తేజ, తాడి వెంకటేశ్వరరావు, సలాది సూరిబాబు, సలాది జగదీష్, సలాది బాల్లితోపాటు పలువురు రూ.2లక్షల సొంత సొమ్ములను వెచ్చించి జేసీబీతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. గోతులున్నచోట నల్ల కంకర వేసి గోతులను పూడ్చి రోలింగ్ చేసే పనులను గురువారం నుంచి చేపట్టారు.

సర్వేల నుంచి విముక్తి కల్పించాలి

●వినతిపత్రం అందించిన సచివాలయ ఉద్యోగులు


ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

పి.గన్నవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందించారు. గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలని, సమయపాలనలేని పట్టికతో కాకుండా వివిధ నుంచి విముక్తి కల్పించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన ఆరునరలో సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

చినబాబుకు సన్మానం


ముదునూరి చినబాబును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

రాజోలు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిన టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ముదునూరి గోపాలకృష్ణరాజు(చినబాబు)ను టీడీపీ ప్రముఖులు సన్మానించారు. గురువారం కడలి రంలోని ఆయన స్వగృహం వద్ద దుశ్శాలువా, పుష్పగుచ్ఛాలతో అభినందించారు. కార్యక్రమంలో సెంట్రల్ డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ, చాగంటి స్వామి, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, కాకి లక్ష్మణ్, రాపాక ఆనంద్‌కుమార్, రాపాక నరసన్న, బాబూరావు ఉన్నారు.

'ఉద్యోగంలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయి'



మామిడికుదురు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని పలువురు వక్తలు కొనియాడారు. మామిడికుదురు హైస్కూలు ప్రధానోపాధ్యాయినిగా పనిచేసి బదిలీపై వెళ్లిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సిహెచ్ నిరంజనిని, మామిడికుదురు హైస్కూలులో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మట్ట నాగరాజును మామిడికుదురు హైస్కూలు సిబ్బంది గురువారం సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ, బిహెచ్ మనోహర్‌రాజు, గోపీ, మట్ట శ్రీధర్, సాయిబాబు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ముందంజ

● స్మార్ట్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్


మాచవరంలో స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అంబాజీపేట,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ముందంజలో ఉందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట మండలం మాచవరం గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన స్మార్ట్‌కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబాజీపేట మండలంలో 19382 మందికి స్మార్ట్‌కార్డులు పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, డీసీసీ ఉదయభాస్కర్, నాయకులు బొంతు పెదబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, అరిగెల నానిబాబు, షేపాల తాతాజీ, కర్రిపాటి గోపీ, దొమ్మేటి సాయికృష్ణ, మట్టపర్తి సోమేశ్వరరావు, దొమ్మేటి రామారావు, గుడాల పాత తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిరతపూడి సొసైటీ కార్యాలయంవద్ద తహశీల్దారు చినబాబు ఆధ్వర్యంలో స్మార్ట్‌కార్డులను పంపిణీ చేశారు. సర్పంచ్ కోట జీవీదాస్, వైస్‌ఎంపీపీ నేతల నాగరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. పాశర్లపూడి పంచాయతీ కార్యాలయంలో గురువారం ప్రభుత్వం నూతనంగా పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ జి.మాధవి, తహశీల్దార్ సునీల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజు, అడబాల తాతకాపు, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అయినవిల్లి(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. గురువారం తొత్తరమూడి గ్రామపంచాయతీలో షాప్ నం.26 వద్ద స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మండలంలో 20,577 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సీహెచ్ విద్యాపతి, సర్పంచ్ వారా జయసావిత్రి, ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, నిమ్మకాయల శెట్టి రాజేష్, గుత్తుల బాబీ, మండల టీడీపీ అధ్యక్షుడు వస్సా శ్యామ్, హెచ్‌ఆర్డీ సభ్యుడు నేదునూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

అంతర్వేది(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిమండలంలో సఖినేటిపల్లి రేషన్‌షాపు-1 వద్ద లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం అందించిన స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సామాన్య ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు కుటుంబంలోని ప్రతీ ఒక్కరికీ రేషన్ అందేలా స్మార్ట్ కార్డులను సిద్ధంచేసి పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, గెద్దం మహాలక్ష్మిప్రసాద్, గుబ్బల శ్రీను, దిరిశాల బాలాజీ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ముప్పర్తి నాని, బర్రే శ్రీను, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, చాగంటి స్వామి, రేషన్‌డీలర్లు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బహుళ ప్రయోజన స్మార్ట్‌కార్డుల పంపిణీ

మలికిపురం(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించడానికి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో నూతన స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంపీ సత్యనాని, ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, గుండుబోగుల పెద్దకాపు, ముప్పర్తి నాని, గెద్దం మహాలక్ష్మిప్రసాద్, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ కృష్ణమూర్తి, తహశీల్దార్ శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యం

రాజోలు(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శివకోడులో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ వలువలరిని స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, ప్రత్యేకాధికారి కృష్ణమూర్తి, రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ, దిరిశాల బాలాజీ, సూరిశెట్టిశ్రీనివాస్, తహశీల్దార్ సీహెచ్ భాస్కర్, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు. పొన్నమండలో ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.


విశ్వేశ్వరాయపురంలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దేవ

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌ను విజయవంతం చేయాలి

అంబాజీపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 18, 19వ తేదీల్లో అంబాజీపేటజిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో నిర్వహించే స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌ను విజయవంతం చేయాలని కె.వెంకటేశ్వరరావు, మెకా ప్రకాశరావు కోరారు. స్థానిక ఎంఆర్సీ భవనంలో మండలస్థాయి క్రీడా పోటీలపై ఎస్జీఎఫ్ మండల కోఆర్డినేటర్ పీడీ కెఅదిలక్ష్మి అధ్యక్షతన మండలంలోని హెచ్‌ఎంలు, పీఈటీలు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ అంబాజీపేట పాఠశాలలో ఈ పోటీలు అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు, యోగా క్రీడాంశాలలో బాలుర, బాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. అథ్లెటిక్స్ విభాగాలలో పోటీలు మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు. ఆయా పోటీలకు ఎంపికైన వారిని డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామని ఎస్జీఎఫ్ కోఆర్డినేటర్ ఆదిలక్ష్మి తెలిపారు. హెచ్‌ఎంలు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

రాజోలు తెలగ ఉద్యోగ సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక

మామిడికుదురు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజోలు తాలూకా ఉద్యోగ సంక్షేమ సంఘ మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా వస్సిరెడ్డి సాయిబాబు, అధ్యక్షుడిగా యెరుబండి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా చిక్కం రవికుమార్, ఆర్థిక కార్యదర్శిగా వలవల ఏడుకొండలు, గౌరవ సలహాదారులుగా యెరుబండి వెంకటనాగభూషణం, తోట వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కొమ్ముల సూర్యనారాయణ, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ సంఘ పురోభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఈ విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందించడానికి నిర్ణయించడం జరిగింది. అర్హత గల విద్యార్థులు మండల సభ్యులను ఈ నెల 31వ తేదీలోగా సంప్రదించాలని సమావేశం ద్వారా కోరారు.

'అనధికార ఆక్వాసాగు చెరువులను తొలగించాలి'

ముమ్మిడివరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలెంలో అనధికారికంగా సాగు చేస్తున్న రొయ్యల చెరువులను తొలగించాలని జిల్లా ఆక్వా అథారిటీ బృందం ఆదేశించింది. రాజుపాలెం గ్రామంలో కొందరు చేపల చెరువులకు అనుమతి తీసుకుని రొయ్యలసాగు చేపట్టారని, దీంతో ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు కలుషితమై వాయు, శబ్ద కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంతానికి చెందిన నల్లబాబు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఫిషరీస్ జేడీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు, వ్యవసాయశాఖ అధికారుల బృందం చెరువులను పరిశీలించారు. చెరువుల అనుమతులను పరిశీలించి చేపల చెరువులకు అనుమతి తీసుకుని రొయ్యల సాగు చేస్తున్నట్టు గుర్తించారు. దీంతో ఆ చెరువులను తొలగించాలని రైతులను ఆదేశించారు. తహశీల్దార్ టి.సుభాష్, ఫిషరీస్ ఎఫ్‌డీవో హేమసుందర్‌కుమార్, తదితరులు ఉన్నారు.


అనధికార రొయ్యల చెరువులను పరిశీలిస్తున్న ఆక్వా అథారిటీ బృందం

యానాంలో సునామీ మాక్‌డ్రిల్


సునామీ మాక్‌డ్రిల్‌లో రక్షణ చర్యలు చేపడుతున్న సిబ్బంది

యానాం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సునామీ వస్తే ప్రభుత్వ యంత్రాంగం ఎలా అప్రమత్తమవ్వాలి, ముంపు ప్రాంతాల ప్రజలను ఎలా రక్షించి వారికి ప్రాథమిక చర్యలు ఎలా చేపట్టాలన్న అంశాలపై పుదుచ్చేరి డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌శాఖ ఉత్తర్వుల మేరకు యానాంలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. యానాం శివారు సావిత్రినగర్, గిరియాంపేటలో నిర్వహించారు. తెలుగు అధికారులు సైరన్లు మోగించుకుంటూ సునామీ హెచ్చరికలు చేశారు. స్థానిక గ్రామ ప్రజల నుంచి రక్షణ చర్యలను పరిపాలనాధికారి అంకితకుమార్ ఇతర శాఖల అధికారులు పర్యవేక్షించారు. పలు పాఠశాలల్లో, ఆసుపత్రుల్లో చికిత్సలు, పునరావాసకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జోషి వెంకటేశ్వరరావు, ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రతినిధులు, విద్యుత్‌శాఖ, పోలీస్, తదితర శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

మామిడికుదురు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆడపా ఉదయభాస్కర్ సూచించారు. పాశర్లపూడి జిల్లాప రిషత్ హైస్కూలులో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా విద్యార్థులకు పోషక విలువలు కలిగిన భోజనాన్ని సమకూర్చుస్తుందని, విద్యార్థులంతా మధ్యాహ్న భోజనాన్ని తినాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 150 మందికి నేత్ర పరీక్షలు

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఇసుకపట్ల జయమణిరమబాబు ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. అమలాపురం ఎల్‌వీ ప్రసాద్ ఐ-కేర్, రాజమహేంద్రవరం శ్రీరామ ఐ-కేర్ అండ్ రెటీనా సెంటర్ సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150మందికి నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, గొలకోటి చిన్నా, యెరుబండి బుజ్జి, పోలిశెట్టి ఉమామహేశ్వరరావు, పంచాయతీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శ్రీవిజయ బాలగణపతి లడ్డూల వేలం

పి.గన్నవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా లంకలగన్నవరంలో శ్రీవిజయ బాలగణపతి స్వామివారికి మహన్యా పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గురువారం నిర్వహించిన స్వామివారి ముడు లడ్డూల వేలంలో యర్రంశెట్టి నాగబాబు రూ.2700, అన్నా బత్తుల నరేష్ రూ.2400, కొండేటి ప్రసాద్ రూ.1200లకు దక్కించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. ఈకార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాటక అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ పద్మకు అభినందనలు

రాజోలు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన బండెల పద్మకు శివకోడులో ఆమె స్వగృహంలో గురువారం టీడీపీ సీనియర్ నాయకులు జగడం సత్యనారాయణ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

హిందీ భాషా సలహాకమిటీ సభ్యుడిగా షంషా సాధిక్



మామిడికుదురు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు, హిందీ భాషా సలహాకమిటీ సభ్యుడిగా నగరం గ్రామానికి చెందిన షంషా సాదిక్‌ను నియమించారు. కేంద్ర ప్రభుత్వం అధికార భాష అయిన హిందీ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులను ఎంపిక చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సాదిక్ ప్రతినిధిగా ఎంపికయ్యారు. ఈమేరకు ఉత్తర్వులను నీతిఆయోగ్ హోం మంత్రిత్వ శాఖ ద్వారా నామినేట్ చేయబడింది. సాదిక్ మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషిచేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

21న వీఏవో రాత పరీక్షకు ఏర్పాట్లు

యానాం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూశాఖలో ఖాళీగా ఉన్న విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(వీఏవో) పోస్టుల ఎంపికకు ఈనెల 21న పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా రాత పరీక్షను నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా యానాంలో 6 పరీక్ష కేంద్రాలలో 1919మంది పరీక్షకు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించి పాలనాయంత్రాంగం పటిష్ఠమైన ఏర్పాట్లను పరిపాలనాధికారి అంకితకుమార్ పర్యవేక్షించారు.

జిల్లా చెస్ ఛాంపియన్‌షిప్‌లో విజేతలు


విజేతకు సర్టిఫికెట్, షీల్డు అందజేస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించినట్టు జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకట సురేష్ తెలిపారు. రాపిడ్ చెస్ పోటీల్లో బండారు సాయిబాబు ప్రథమ, ఐశ్వర్య సాత్విక్ ద్వితీయస్థానం సాధించారని బ్లిట్జ్ చెస్ పోటీల్లో బ్రహ్మకాశరావు సాత్విక్ ప్రథమ, పడితెట్టి సాయిఅవినాష్ ద్వితీయ స్థానాలు సాధించినట్టు తెలిపారు. ఈ నెల 13 నుంచి నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి రాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని సురేష్ తెలిపారు. విజేతలను అయన అభినందించారు.

సోమేష్‌కు ప్రెస్‌క్లబ్ సంతాపం

అంబాజీపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన జర్నలిస్టు దంగేటి సోమేశ్వరరావు(సోమేష్) మృతి ప్రెస్‌క్లబ్ సంతాపం వ్యక్తం చేసింది. స్థానిక ప్రెస్‌క్లబ్‌కార్యాలయంలో క్లబ్ అధ్యక్షుల పక్క సూర్యప్రకాశరావు(బాల్జి) అధ్యక్షతన సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సోమేష్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో సీఎస్ మూర్తి, మట్టపర్తి శ్రీనివాస్, ఐ.ప్రఫుల్‌కుమార్, మాలే దుర్గాప్రసాద్, మద్దింశెట్టి శ్రీనివాసు, గుత్తుల ఏడుకొండలు, జె.విక్టర్‌కుమార్, మహిపాల నాగరాజు, కోన సత్తిబాబు సంతాపం వ్యక్తంచేశారు.

మంత్రి లోకేశ్‌ కృషి అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని రప్పించేందుకు మంత్రి లోకేశ్‌ కృషి అభినందనీయమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ మంత్రి లోకేశ్‌ తెలుగువారిని రప్పించేందుకు అనంతపురం పర్యటనను కూడా రద్దు చేసుకున్నారన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో హెల్ప్‌లైన్‌ ఏర్పాటు చేసి వారికి ఆహారం, నీరు, వసతి సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ: మందపల్లి మాజీ సర్పంచ్‌, శనేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్‌ చింతం విజయకృష్ణమోహన్‌ అల్లుడు ఇటీవల హైదరాబాద్‌లో మృతి చెందారు. దీంతో ఎమ్మెల్యే బండారు గురువారం మందపల్లిలోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దర్నాల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు సిద్దంశెట్టి వీరవెంకట సత్యనారాయణ, నక్కా రాఘవులు, కొల్లి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ముందుకే



ఎంపీడీవో రాజుకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఆలమూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను 15 రోజుల వ్యవధిలో పరిష్కరించకుంటే ముందుకెళ్లి నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సచివాలయ ఉద్యోగులు అధికార్లుకు నోటీసులు అందించారు. రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల పిలుపులో బాగంగా గురువారం ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజుకు సచివాలయ ఉద్యోగులు కలసి వినతితో కూడిన నోటీసులను అందించారు. ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేలు ఇతర పనులు నుంచి విముక్తి కల్పించాలని, గ్రామ సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలని సమయపాలన లేని వత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కల్పించాలని సచివాలయ ఉద్యోగుల ఆందోళనలో ప్రధాన డిమాండ్లుగా ముందుకు వెళ్లుతున్నారు. ఈసమస్యలను 15రోజుల వ్యవధిలో పరిష్కరించకుంటే సమ్మెల చేయడానికి కూడా వెనుకాడమని రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు సూచనలలో భాగంగా ఆ నోటీసులో పేర్కొన్నారు. అలాగే తాము దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఆలమూరు మండల సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవో రాజుకు భోజన విరామ సమయంలో అందించారు.

గడ్డిమందు అమ్మకంలో నిబంధనలు పాటించాలి

వ్యాపారులకు మంత్రి సుభాష్‌ హెచ్చరిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు వాటి అమ్మకాల్లో నిబంధనలు పాటించాలని లేనిపక్షంలో లైసెన్సులు రద్దు చేస్తామని మంత్రి సుభాష్‌ హెచ్చరించారు. గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల గడ్డి మందు తీసుకుని చనిపోయేవారి సంఖ్య పెరుగుతుండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గడచిన ఏడాది కాలంలో గడ్డిమందు సేవించి సుమారు 35 మంది మృత్యువాత పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. పాసు పుస్తకాలు, బిల్లులు లేకుండా విక్రయాలు జరిపే షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నేపాల్‌లో చిక్కుకున్న వారిని ఆదుకుంటాం: నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలుగు వారిని తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ కల్యాణ్‌, మంత్రి లోకేష్‌ విశేషమైన కృషి చేశారని మంత్రి అన్నారు. అనంతపురం పర్యటనను మంత్రి రద్దు చేసుకుని, అక్కడి బాధితులతో మాట్లాడారన్నారు. మానవతా విలువలకు కట్టుబడి ఉన్న పార్టీగా మరోసారి నిరూపించారన్నారు. విలేకరుల సమావేశంలో కొత్తపల్లి శ్రీనుబాబు, మురార్జీ, బొండా వెంకన్న, ప్రకాష్‌ తదితరులు పాల్గొన్నారు.

జన సైనికుల కుటుంబాలకు చెక్కుల అందజేత



కపిలేశ్వరపురం మండలం టేకిలో బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న అనిత

మండపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన జనసైనికుడు కొమ్మిరెడ్డి సత్తిబాబు కుటుంబానికి రాష్ట్ర ఏపీఐడీసీ చైర్మన్‌ వేగుళ్ల లీలాకృష్ణ సతీమణి అనిత గురువారం రూ.5లక్షల ప్రమాదబీమా సాయాన్ని అందజేశారు. అనంతరం ద్వారపూడికి చెందిన జన సైనికుడు గునాపు రామ్మూర్తి మరణించగా అతడికి మంజూరైన బీమా చెక్కు రూ.5 లక్షలను గురువారం వారి కుటుంబ సభ్యులకు ఆమె అందజేశారు. అమె వెంట జనసైనికులు, పార్టీనేతలు చింతా దొరబాబు, మండల వైస్‌ ఎంపీపీ జి.రమణ, సత్తిబాబు, కేశవరం సహకార సంఘ అధ్యక్షుడు ఉండమట్ల శ్రీనువాసరావు, కుంచే ప్రసాద్‌, ఉండమట్ల వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం టేకి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన జనసేన క్రియాశీలక సభ్యుడు ఎం.వీరరాఘవ కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కును వేగుళ్ళ లీలాకృష్ణ సతీమణి అనిత గురువారం అందజేశారు. సభ్యత్వం నమోదు చేయించిన వలంటీర్‌ వానపల్లి దుర్గాప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కేంద్ర కార్యాలయం సిబ్బంది, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త బోడపాటి శ్రీనివాసరావు ఇటీవల మరణించారు. దీంతో పార్టీ తరపున భరోసా కల్పిస్తూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ రూ.5 లక్షల చెక్కును పంపారు. గురువారం వలంటరీ మల్లవరపు నాగబాబు, కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్‌ బండారు శ్రీనివాస్‌ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తోట స్వామి, చేకూరి కృష్ణంరాజు, సురపరెడ్డి సత్య, కంఠంశెట్టి చంటి, జిల్లా కార్యదర్శి బొక్కా ఆదినారాయణ, సంగీత్‌ సుభాష్‌ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన కేంద్ర వైద్య ఆరోగ్య సంక్షేమశాఖ ఆర్డీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీ అనురాధ

ద్రాక్షారామ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ పీహెచ్‌సీని కేంద్ర వైద్య ఆరోగ్య సంక్షేమశాఖ ప్రాంతీయ డైరెక్టరు డాక్టర్‌ అనురాధ తనిఖీ చేశారు. ఓపీలో ఉన్న రోగులతో ఆమె మాట్లాడారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం అయ్యారు. మహిళలు, చిన్నారుల రక్తహీనత నష్టాలు గురించి వివరించారు. పీహెచ్‌సీలో మొక్కలు నాటాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో స్టేట్‌ కన్సల్‌టెంట్‌ డాక్టర్‌ లక్ష్మణ్‌, డీఎంవో, ఎంపీహెచ్‌ఈవో తదితరులు ఉన్నారు.

స్వామి వివేకానందుడికి బీజేపీ నాయకుల నివాళి

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద చికాగో సభలో ప్రసంగించిన రోజు సెప్టెంబరు 11ను పురస్కరించుకుని బీజేపీ నాయకులు వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పించారు. శివాలయం వద్ద వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దునే శ్రీనివాస్‌, పూర్వ అధ్యక్షుడు కేశవ రాఘవేంద్రరావు, నాయకులు గానాల కల్యాణ్‌, జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టువాడ హరిబాబు, సలాది సతీష్‌నాయుడు, పట్టణ ఉపాధ్యక్షులు కులపాకుల వెంకట రమణ, కొనపాల గణేష్‌, కుప్పెల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం



అన్నదానానికి విరాళం ఇచ్చిన దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కాజులూరు మండలం ఆర్యవటానికి చెందిన సనపాల వెంకటేశ్వరరావు, శ్యామల దంపతులు రూ.51,116, పశ్చిమగోదావరి జిల్లా పెనుమంత్రకు చెందిన నరాలశెట్టి గిరిబాబు, మాధవి దంపతులు రూ.50,116 విరాళాలు సమర్పించారు. దాతలకు ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటాన్ని అందచేశారు.

నూతన పార్కింగ్‌ పరిశీలన

వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు పార్కింగ్‌ కష్టాలు పరిష్కారం కానున్నాయి. శ్రీనివాస ప్రాంగణంలో బైక్‌లకు పార్కింగ్‌ ఏర్పాటు చేయగా గోదావరి సమీపంలో కార్లకు పార్కింగ్‌ కల్పించారు. ఆ ప్రాంగణం బురదగా మారడంతో ట్రాఫిక్‌ కష్టాలు ఏర్పడేవి. దీంతో ఈ ప్రాంతాన్ని పూడిక పనులు చేపట్టి గ్రావెల్‌తో నూతన పార్కింగ్‌ను నిర్మాణాన్ని చేపట్టారు. గురువారం ఆయా పనులను ఈవో చక్రధరరావు పరిశీలించారు. భక్తుల రద్దీ కారణంగా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. పీఆర్వో కార్యాలయం వద్ద నూతన జలప్రసాద కౌంటర్‌ పనులను ఆయన పరిశీలించారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

దాత సహకారంతో విద్యార్థులు రాణించాలి

కె.గంగవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు దాత అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పామర్రు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎర్ర ఈశ్వరుడు అన్నారు. గురువారం పాఠశాలలో 30 మంది విద్యార్థులకు కాకినాడ వైద్యుడు సత్యస్కాన్‌ డాక్టర్‌ కె.వెంకటరమణ పుస్తకాలు అందజేశారు.

స్మార్ట్‌ రేషన్‌కార్డుతో ఎక్కడినుంచైనా సరుకులు

మంత్రి సుభాష్‌





మండపేట మండలం మారేడుబాకలో స్మార్ట్‌ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల. పక్క చిత్రంలో ఆలమూరులో స్మార్ట్‌ రేషన్‌ కార్డులను పంపిణీ చేస్తున్న తహసీల్దార్‌, నాయకులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్‌ రేషన్‌ కార్డుతో లబ్ధిదారులు ఎక్కడి నుంచైనా రేషన్‌ తీసుకోవచ్చని మంత్రి సుభాష్‌ అన్నారు. గురువారం రామచంద్రపురం పట్టణం ముచ్చుమిల్లిలో 4వ నెంబర్‌ చౌకధరల దుకాణంలో స్మార్ట్‌ రేషన్‌ కార్డులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్మార్ట్‌ కార్డుతో రేషన్‌ అక్రమాలకు అడ్డుకట్టపడుతుందన్నారు. ఆర్డీవో దేవరకొండ అఖిల మాట్లాడుతూ కార్డులో క్యూఆర్‌ కోడ్‌ ద్వారా రేషన్‌ తీసుకున్న వెంటనే రాష్ట్ర, జిల్లాస్థాయిలో అధికారులకు సమాచారం అందుతుందన్నారు. డీఎస్‌వో ఉదయభాస్కర్‌ మాట్లాడుతూ మండలంలో 34,252 స్మార్ట్‌కార్డులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌వో ప్రియదర్శిని, తహసీల్దార్‌ మృత్యుంజయరావు, రెవెన్యూ, సివిల్‌ సప్లయిస్‌ అధికారులు, మున్సిపల్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ చింతపల్లి వీరభద్రరావు, కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్‌ ట్రస్టు చైర్మన్‌ నాయుడు మాస్టారు, అగస్త్యేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌ చెరుకుపల్లి గణేష్‌ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): రేషన్‌ అక్రమాలను అరికట్టేందుకే స్మార్ట్‌ రైస్‌ కార్డులు రూపొందించి పంపిణీ చేస్తున్నామని మంత్రి వాసంశెట్టి సుభాష్‌ అన్నారు. గురువారం కుందూరు గ్రామంలో ఆయన స్మార్ట్‌ రైస్‌ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. క్యూఆర్‌ కోడ్‌తో అక్రమాలు అరికట్టడం జరుగుతుందన్నారు. డీఎస్‌వో అడపా ఉదయ భాస్కర్‌ మాట్లాడుతూ స్మార్ట్‌ రైస్‌ కార్డుతో ఎక్కడి నుంచైనా రేషన్‌ తీసుకోవచ్చునని చెప్పారు. కార్డు పోగొట్టుకుంటే లబ్ధిదారుడు 12 రోజుల్లోగా సచివాలయం ద్వారా డూప్లికేట్‌ కార్డు పొందవచ్చునని తెలిపారు. ఆర్డీవో అఖిల మాట్లాడుతూ మండలంలో 20,400 రైస్‌ కార్డులు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ పి.శ్రీరామప్రసాద్‌, ఆర్‌ఐ వెంకట్రావు, స్వచ్ఛభారత్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ సలాది రమేష్‌, రాష్ట్ర నాటక కార్పొరేషన్‌ డైరెక్టర్‌ పెంకే అన్నపూర్ణ, సొసైటీ అధ్యక్షుడు జగతా రమణ, కూటమి నాయకులు మేడిశెట్టి బాబి, చిర్రా సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు అందజేసిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. మారేడుబాక గ్రామంలో గురువారం స్మార్ట్‌ రేషన్‌కార్డుల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో ఆయన లబ్దిదారులకు వాటిని అందజేశారు. రేషన్‌ పంపిణీలో అవకతవకలకు తావు లేకుండా స్మార్ట్‌కార్డులు దోహద పడతాయన్నారు. మండపేట తహసీల్దార్‌ టీ. తేజేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 42,593 స్మార్ట్‌ రేషన్‌ కార్డులు మంజూరయ్యాయ న్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు సర్పంచ్‌ మట్టపర్తి గోవిందరాజులు, డీ.టీలు, పద్మ, తహసీల్దార్‌, మోహర్‌బాబా, టీడీపీ నాయకులు పసలపూడి శ్రీనువాస్‌, రాయుడు గంగరాజు, ఆర్‌ఐ వాసంతి, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌, కూటమి నాయకులు పాల్గొన్నారు. మండలంలో వున్న 12 గ్రామాల్లో కూటమి నాయకులు స్మార్ట్‌ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. పట్టణంలోని 30 వార్డుల్లో కూటమి నేతలు, వార్డు ఇన్‌చార్జిలు, కౌన్సిలర్‌లు స్మార్ట్‌ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.

అవకతవకలకు చోటు లేకుండా పంపిణీ

రాయవరం, (ఆంధ్రజ్యోతి): రేషన్‌ పంపిణీలో అవకతవకలకు చోటు లేకుండా నిత్యావసరాలు పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. గురువారం రాయవరం గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్‌ కార్డుల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పారదర్శకతతో ప్రజా పంపిణీ వ్యవస్థ పనిచేస్తున్నదన్నారు. మండలంలో 21వేల 39 రేషన్‌కార్డులు ఉండగా 20,896 కార్డులను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. యూరియాపై ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్‌నేత ఉండవిల్లి రాంబాబు, సర్పంచ్‌లు చంద్రమళ్ల రామకృష్ణ, చాట్రాతి జానకి రాంబాబు, తహశీల్దారు ఐపీ శెట్టి, ఎంపీడీవో కీర్తి స్పందన, జనసేన నేత డి.చిన్ని, కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

23,906 స్మార్ట్‌ రేషన్‌కార్డులు పంపిణీ

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం స్మార్ట్‌ రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభించారు. మండలంలో 23,906 స్మార్ట్‌ రేషన్‌కార్డులు వచ్చినట్టు తహసీల్దార్‌ కెజె.ప్రకాష్‌బాబు తెలిపారు. ఆలమూరు రామాలయం వద్ద ఉన్న రేషన్‌షాపులో తహసీల్దార్‌ ప్రకాష్‌బాబుతోపాటు టీడీపీ మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, కూటమి నాయకులు వంటిపల్లి సతీష్‌కుమార్‌, ఈదల నల్లబాబు, కేతా రాంబాబు, అనుసూరి నాగరత్నం, బైరిశెట్టి రాంబాబు, సి.గణేష్‌తోపాటు పలువురు నాయకులు లబ్ధిదారులకు స్మార్ట్‌ రేషన్‌కార్డులు అందించారు. మండలంలో అన్ని రేషన్‌షాపుల వద్ద పంపిణీ జరుగుతుందని తహసీల్దార్‌ ప్రకాష్‌బాబు తెలిపారు.

స్మార్ట్‌ రేషన్‌కార్డుల పంపిణీ

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురంలో గురువారం తహసీల్దారు రాజేశ్వరరావు క్లస్టర్‌ ఇన్‌చార్జ్‌ ముదునూరి వెంకట్రాజు, రామబద్రిరాజు, స్మార్ట్‌కార్డుల పంపిణీ నిర్వహించారు. పేరవరంలో ముళ్ళపూడి భాస్కరరావు, ర్యాలిలో పెండెం వెంకన్నల ఆధ్వర్యంలో కార్డులను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో కూటమి నాయకులు, అధికారులు సచివాలయ ఉద్యోగులు స్మార్ట్‌కార్డుల పంపిణీలో పాల్గొన్నారు. ఆయా రేషన్‌ షాపుల వద్ద దీన్ని నిర్వహించారు.

పారదర్శకంగా రేషన్‌ పంపిణీ

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌ రేషన్‌కార్డుల ద్వారా పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ పారదర్శకంగా అమలవుతుందని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్‌ తెలిపారు. గురువారం చౌకధరల దుకాణం వద్ద స్మార్ట్‌ రేషన్‌కార్డుల పంపిణీ చేపట్టారు. ఆయా రేషన్‌ షాపుల వద్ద కూటమి నాయకులు స్మార్ట్‌కార్డుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దారు వై.రాంబాబు, ఆర్‌ఐ రవిశంకర్‌, సర్పంచ్‌ బూసి జయలక్ష్మి, ఉపసర్పంచ్‌ విళ్ళ మారుతీప్రసాద్‌, కంఠంశెట్టి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మండపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్‌ రోడ్డులో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల వివరాల ప్రకారం...బైపాస్‌ రోడ్డులో వున్న సత్య ఆటో మెకానిక్‌ షెడ్డు వద్ద సుమారు 50 ఏళ్లలోపు ఉన్న వ్యక్తి సమాధుల పక్కన పడి ఉండగా పట్టణానికి చెందిన ఒకరు పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. మృతుడి ఒంటిపై నలుపురంగు చొక్కా, జీన్‌ప్యాంట్‌ ధరించి ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 94407 96591, 83329 57936లో సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

యూరియా లభ్యతపై రైతులకు అవగాహన

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): యూరియా లభ్యతపై గురువారం మండలంలోని మాచర, వాకతిప్ప, కోరుమిల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, తహసీల్దార్‌ జి.శ్రీనివాస్‌, ఏవో బి. రవి మాట్లాడారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, రైతులు, వ్యవసాయశాఖ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని వ్యవసాయ శాఖ మండల అధికారి ఏ.సద్గురుమూర్తి, తహసీల్దార్‌ పి.శ్రీరామప్రసాద్‌ అన్నారు. గురువారం వారు కుడుపూరు గ్రామంలో యూరియా లభ్యతపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పత్తి సూరిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌

ఆలమూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా సంధిపూడి గ్రామానికి చెందిన సిద్దిరెడ్డి శ్రీనివాస్‌ను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా ఆయన్ను నియమించినట్లు మండల అధ్యక్షుడు శ్రీరాములు ఉత్తర్వులు ఇచ్చార న్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నెరవేరుస్తానని శ్రీనివాస్‌ చెప్పారు.

ఆర్థికసాయం

రావులపాలెం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీ కమ్యూనిటీ హాల్‌ అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు ఆర్థికసాయం అందించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. రావులపాలెంలోని హాల్‌ అభివృద్ధి పనులు అప్న అంజుమన్‌ ఫలహే మిలత్‌ కమిటీ సభ్యులు చేపట్టారు. వారు ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబును కలవగా రూ.2 లక్షల చెక్కును వారికి అందచేసినట్లు అంజుమన్‌కమిటీ సభ్యులు బాషా, జహంఫీర్‌, మొహిద్దీన్‌, జాకీర్‌, బాజానీ తెలిపారు.

అన్న సమారాధనలు

కె.గంగవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో గణపతి నవరాత్రి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని అన్న సమారాధనలు నిర్వహించారు. గంగవరం బస్‌స్టాండ్‌ సెంటర్‌, దంగేరు శివాలయం వద్ద, కూళ్ల మెయిన్‌ రోడ్డు, పామర్రు బీసీ కాలనీల్లో భారీ అన్నాసమారాధనలు నిర్వహించారు.

సత్యసాయి శత జయంతి ఉత్సవాలు



ఆలమూరులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలమూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి వేడుకల సందర్భంగా గురువారం ఆలమూరులో భజనలు, గ్రామోత్సవం నిర్వహించారు. ఆలమూరు సత్యసాయి మందిర నిర్వాహకులు కంచర్ల కామేశ్వరరావు ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చిన సాయి భక్తుల ఆధ్వర్యంలో సాయి భజనలు, గ్రామోత్సవం చేశారు. ముందుగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సాయిభక్తులు కంచర్ల రమేష్‌, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కె.గంగవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల యండగండి గ్రామంలో ఊకలోడు లారీని ఢీకొని మృతి చెందిన బాధిత కుటుంబాన్ని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. వారి కుటుంబ పరిస్థితిని కార్మికశాఖా మంత్రి దృష్టికి తీసుకెళతానని ఆయన తెలిపారు. హెల్మెట్‌ ధరించని కారణంగా తలకు గాయమై మృతి చెందడం దురదృష్టకరమన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి

కె.గంగవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్‌ అన్నారు. గురువారం ఆయన మండలంలోని సత్యవాడ, దంగేరు, శివల, భట్లపాలిక, మసకపల్లి, అద్దంపల్లి, బాలాంత్రం, యర్రపోతవరం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఓవీ రమణ, మండల గౌరవాధ్యక్షులు డి.లోవరాజు, అసోసియేట్‌ అధ్యక్షులు షేక్‌ నౌషద్‌, మండల ప్రధాన కార్యదర్శి డీవీవీ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ప్రజా ప్రతినిధులు

రాయవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాయవరం మహాలక్ష్మి అమ్మవారి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. విద్యుత్‌శాఖ ఏఈ ఎస్‌.శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్‌ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, టీడీపీ సీనియర్‌ నేత ఉండవిల్లి రాంబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఐపీ శెట్టి, లైన్‌మెన్లు శ్రీకాంత్‌, మురళీకృష్ణ, విద్యుత్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

రాయవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని వెదురుపాక యూనియన్‌ బ్యాంక్‌ మేనేజర్‌ ఎల్‌.మహేష్‌, సర్పంచ్‌ మల్లిడి సూరారెడ్డి అన్నారు. గురువారం వెదురుపాక సచివాలయం వద్ద ఆర్థిక అక్షరాస్యతపై యూనియన్‌ బ్యాంక్‌ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మేనేజర్‌ మాట్లాడుతూ సైబర్‌ నేరాలు, మోసాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో యానిమేటర్‌ యం.శ్రీదేవి, వడ్డాది రాంబాబు గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు డాన్‌బాస్కో విద్యార్థుల ఎంపిక



రావులపాలెం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రావులపాలెం డాన్‌బాస్కో పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ జె.విద్యాసాగర్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 24 వరకూ కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌ అండర్‌-19 విభాగానికి టెన్త్‌ చదువుతున్న ఆర్‌.పవన్‌కుమార్‌, ఏ.వినయ్‌ ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌ విద్యాసాగర్‌, కరస్పాండెంట్‌ ఆర్‌.రెమ్మలథామస్‌, పీఈటీ శ్రీనివాసరావు అభినందించారు.